RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అవగాహన లోపం 2

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 85 | ఏప్రిల్ 14 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 85 | April 14 Tuesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

## బిల్లును అనుసంధానించడం
# వెనుక కుట్ర

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శ




**హైదరాబాద్ జనసంఘర్షణ**

మహిళా రిజర్వేషన్ల బిల్లును, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియతో అనుసంధానించడం వెనుక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, అయితే ఈ రెండు వేర్వేరు అంశాలను కలిపి ప్రధాని మోదీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని విమర్శించారు. 2026 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ గతంలోనే కోరిందని, కానీ ఇప్పుడు 2011 నాటి

➤ మిగతా 2వ పేజిలో..

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

### మహిళ మావోయిస్టు మృతి



**కాంకేర్ జనసంఘర్షణ**

ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లా ఛోటే బెట్టియా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు కమాండర్ మృతి చెందారు. రూపీగా గుర్తించిన ఈ మావోయిస్టుపై ప్రభుత్వం రూ. 5 లక్షల రివార్డును ప్రకటించింది. విశ్వసనీయ సమాచారం మేరకు భద్రతా బలగాలు ఈ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు ఎదురుపడటంతో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఎన్‌కౌంటర్ అనంతరం రూపీ మృతదేహంతో పాటు ఆయుధాలను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. కాల్పుల సమయంలో సుమారు పదిమంది మావోయిస్టులు దట్టమైన అటవీ ప్రాంతం వైపు పారిపోయినట్లుగా సమాచారం. వారిని పట్టుకునేందుకు డ్రోన్ల సహాయంతో పాటు ప్రత్యేక బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఈ ప్రాంతం గత కొంతకాలంగా మావోయిస్టు కార్యకలాపాలకు నిలయంగా ఉండటంతో, భద్రతా దళాలు నిఘాను మరింత పెంచాయి. ప్రస్తుతం కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్ నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. అటవీ ప్రాంతం అత్యంత దట్టంగా ఉండటంతో భద్రతా బలగాలు చాలా జాగ్రత్తగా ఆపరేషన్‌ను ముందుకు తీసుకెళ్తున్నాయి. మావోయిస్టుల

➤ మిగతా 2వ పేజిలో..

## మహిళలకు సంక్షేమ పరికరాలను పంపిణీ



**ఖమ్మం జనసంఘర్షణ**

ఖమ్మం జిల్లాలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంగన్‌వాడీ టీచర్లు, వికలాంగులు మరియు మహిళలకు సంక్షేమ పరికరాలను పంపిణీ చేశారు. అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్లు, వికలాంగులకు ట్రై సైకిళ్లు, అలాగే 'ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో' భాగంగా 500 మంది మహిళలకు కుట్టు మిషన్లను ఆయన అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, అంగన్‌వాడీల సేవలు వెలకట్టలేనివని, రాజకీయాలకు అతీతంగా పేదలకు, చిన్నారులకు నిబద్ధతతో సేవలు అందించాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ ఫోన్ల కొనుగోలులో అక్రమాలు జరిగాయని జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. పారదర్శకత కోసం నేరుగా కంపెనీ నుంచే తక్కువ ధరకే ఈ ఫోన్లను కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. అంగన్‌వాడీల కోసం కొత్త భవనాల నిర్మాణం చేపడుతున్నామని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని హామీ ఇచ్చారు. మహిళా సంక్షేమంపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చును వివరిస్తూ, ఈ ఏడాది డ్వాక్రా మహిళలకు రూ. 23 వేల కోట్ల రుణాలు మంజూరు చేశామని తెలిపారు. ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు ఇప్పటివరకు రూ. 10 వేల కోట్ల లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. రేషన్ బియ్యం అక్రమాలకు అడ్డుకట్ట వేసి, పేదలందరికీ నాణ్యమైన సన్నబియ్యం అందించేందుకు ప్రభుత్వం రూ. 14 వేల కోట్లు ఖర్చు

➤ మిగతా 2వ పేజిలో..

## వేర్వేరు రోడ్డు ప్రమాదంలో
# 13మంది మృతి

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

దేశవ్యాప్తంగా జరిగిన రెండు వేర్వేరు ఘోర రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 13 మంది దుర్మరణం చెందారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్ జిల్లాలో జరిగిన ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్‌లో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృత్యువాత పడ్డారు.

గుజరాత్‌లోని లఖ్తర్-విరామ్‌గామ్ రహదారిపై భాస్కర్‌పారా సమీపంలో సోమవారం తెల్లవారుజామున విషాదం చోటుచేసుకుంది. రాజ్‌కోట్‌లోని గద్కా గ్రామం నుండి దేకావాలాలోని మహాదేవ్ ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్న యాత్రికులపైకి అదుపుతప్పిన ట్రక్కు దూసుకెళ్లింది. ఆ సమయంలో యాత్రికులు రోడ్డు పక్కన ఆగి ఉన్న డంపర్ టైరు మారుస్తున్న డ్రైవర్‌ను దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు యాత్రికులు (ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు) అక్కడికక్కడే మరణించగా, టైరు మారుస్తున్న డంపర్ డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తున్న ప్రయాణికులతో వెళ్తున్న బస్సు, ముందు వెళ్తున్న ట్రక్కును బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న

➤ మిగతా 2వ పేజిలో..

## మళ్లీ ఉద్రిక్తతలు

### బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 103 డాలర్లు



**టెహ్రాన్ జనసంఘర్షణ**

పశ్చిమాసియాలో చెలరేగిన తాజా ఉద్రిక్తతలు అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. హోర్ముజ్ జలసంధిని దిగ్బంధిస్తామన్న ప్రకటనలు క్రూడాయిల్ సరఫరాపై ఆందోళనను పెంచడంతో, బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 103 డాలర్లకు ఎగబాకింది. ఈ భౌగోళిక రాజకీయ అనిశ్చితి నేరుగా భారత స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపింది.సోమవారం భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ప్రారంభమై రోజంతా ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఒక దశలో దాదాపు

➤ మిగతా 2వ పేజిలో..

## భూభారతి' ప్రాజెక్టుకు ఏడాది విజయవంతంగా పూర్తి

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ జనసంఘర్షణ**

భూ పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'భూభారతి' ప్రాజెక్టు విజయవంతంగా ఏడాదిని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతంలో ధరణి పోర్టల్ వల్ల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించి, పారదర్శకత, బాధ్యత మరియు వేగవంతమైన సేవలే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు ఆయన వివరించారు. గత ఏడాది కాలంలో భూభారతి పోర్టల్ అద్భుతమైన ఫలితాలను సాధించింది. ఇప్పటివరకు 5.20 కోట్లకు పైగా వినియోగదారులు ఈ పోర్టల్‌ను సందర్శించగా, సుమారు

➤ మిగతా 2వ పేజిలో..

## బిల్లును అనుసంధానించడం వెనుక కుట్ర

**మొదటిపేజీ తరువాయి..** పాత జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవడం వెనుక వివక్ష ఉందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల కంటే, జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు సీట్ల పెంపు ద్వారా రాజకీయ ప్రాబల్యం పెంచే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రతిపాదన మేరకు సీట్లు పెంచితే, ఉత్తరాదికి 620, దక్షిణాదికి 195 స్థానాలు ఉంటాయని, దీనివల్ల రెండు ప్రాంతాల మధ్య అంతరం భారీగా పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్రం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, సీట్ల పెంపుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం జనాభా ప్రాతిపదికన కాకుండా, దేశ జీడీపీకి తోడ్పడుతున్న దక్షిణాది రాష్ట్రాలను గౌరవించేలా "హైబ్రిడ్ ప్రాతిపదిక"ను అనుసరించాలని రేవంత్ రెడ్డి సూచించారు. కొత్తగా పెంచే సీట్లలో సగభాగాన్ని జనాభా ప్రాతిపదికన, మిగిలిన సగభాగాన్ని ఆయా రాష్ట్రాల జీడీపీ వృద్ధి ఆధారంగా కేటాయించాలని ఆయన ప్రతిపాదించారు. రాజకీయ రాజధానులుగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలు, ఆర్థిక వనరులను సమకూర్చే దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూడటం దేశ సమగ్రతకే ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో మంత్రులు, ఎంపీలు మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## చత్తీస్‌గడ్‌లో ఎన్‌కౌంటర్

**మొదటిపేజీ తరువాయి..** ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్న క్రమంలో, భద్రతా సవాళ్లను ఎదుర్కొంటూనే ఈ గాలింపు కొనసాగుతోంది. గడిచిన నెల రోజుల్లోనే జరిగిన రెండో పెద్ద ఘటనగా దీనిని భావిస్తున్నారు. ఈ కూంబింగ్ ఆపరేషన్ మరికొన్ని రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని భద్రతా వర్గాలు పేర్కొంటున్నాయి.

## వేర్వేరు రోడ్డు ప్రమాదంలో 13మంది మృతి

**మొదటిపేజీ తరువాయి..** పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించగా, వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ప్రాథమికంగా భావిస్తున్న పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బస్సులో ఉన్న ప్రయాణికుల్లో ఒకరి ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు వెల్లడించారు.

## భూభారతి' ప్రాజెక్టుకు ఏడాది విజయవంతంగా పూర్తి

**మొదటిపేజీ తరువాయి..** 67 లక్షల మంది లాగిన్ అయ్యారు. అలాగే, ఈ కాలంలో సుమారు 3.80 లక్షల రైతులకు పాస్‌బుక్‌లను జారీ చేశారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రతి సర్వే నంబర్‌కు 'భూధార్' నంబర్‌ను కేటాయిస్తోంది. ఇప్పటికే ఐదు జిల్లాల్లోని ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ విధానాన్ని, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా విస్తరించనున్నట్లు మంత్రి తెలిపారు.

పాతకాలపు సర్వే పద్ధతులకు స్వస్తి పలికిన ప్రభుత్వం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. నిజాం కాలం నుండి నక్షాలు లేని గ్రామాలను గుర్తించి, రోవర్ల వంటి అత్యాధునిక యంత్రాల ద్వారా రీ-సర్వే చేపడుతోంది. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 యంత్రాలను సమకూర్చుకోనున్నారు. ఈ పనుల కోసం 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి నియమించారు. భూ పరిపాలనను మరింత సులభతరం చేసేందుకు రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చామని, తెలంగాణ రైతాంగానికి భూ భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## మళ్లీ ఉద్రిక్తతలు

**మొదటిపేజీ తరువాయి..** 1600 పాయింట్ల మేర పడిపోయినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత కొంత కోలుకుంది. చివరకు సెన్సెక్స్ 702 పాయింట్ల నష్టంతో 76,847 వద్ద, నిఫ్టీ 207 పాయింట్ల నష్టంతో 23,842 వద్ద ముగిశాయి. బ్యాంక్ నిఫ్టీ 307 పాయింట్లు, నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 330 పాయింట్ల మేర నష్టపోయాయి. మరోవైపు, అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 93.38కి పడిపోయి మరింత బలహీనపడింది.

మార్కెట్ ట్రెండ్‌ను గమనిస్తే, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, ఎమ్‌సీఎక్స్ ఇండియా, వోల్టాస్, సోలార్ ఇండస్ట్రీస్, అదానీ పవర్ వంటి షేర్లు లాభాలను నమోదు చేయగా, ఐచర్ మోటార్స్, చోలా ఇన్వెస్ట్‌మెంట్, మారుతీ సుజుకీ, నిప్పాన్, ఏపీఎల్ ఆపోలో వంటి షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. ముడి చమురు ధరల పెరుగుదల మరియు రూపాయి పతనం వంటి అంశాలు పెట్టుబడిదారుల్లో ఆందోళన కలిగిస్తుండటంతో మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగుతోంది.

## మహిళలకు సంక్షేమ పరికరాలను పంపిణీ

**మొదటిపేజీ తరువాయి..** చేస్తోందని వెల్లడించారు. విద్య ప్రాధాన్యతను నొక్కిచెబుతూ, పిల్లల చదువుపై మహిళలు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి కోరారు. ఖమ్మం జిల్లాలోని గురుకులాల్లో చదువుకునే ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం ఏడాదికి రూ. 1.50 లక్షలు ఖర్చు చేస్తోందని, ఉన్నత విద్యే కుటుంబాలను పేదరికం నుంచి బయటపడేస్తుందని ఆయన ఉద్ఘాటించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అవగాహన లోపం

మహిళా రిజర్వేషన్లు మరియు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అవగాహన లోపం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రేవంత్ రెడ్డి చేసిన సోషల్ మీడియా (ఎక్స్) పోస్ట్‌పై స్పందించిన ఆయన, మహిళా సాధికారత కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని రాజకీయ కోణంలో చూడవద్దని కోరారు. పార్లమెంటులో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరగనున్న చర్చలో ఎంపీలందరికీ మాట్లాడే అవకాశం ఉంటుందని, ఆ వేదికను ఉపయోగించుకోవాలని సూచించారు.

దశాబ్దాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ల గురించి ఎందుకు పట్టించుకోలేదని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం 70 కోట్ల మంది మహిళల గౌరవాన్ని పెంచేందుకు, వారికి చట్టసభల్లో సమాన హక్కులు కల్పించేందుకు కృషి చేస్తుంటే, కాంగ్రెస్ నాయకులు అనవసరమైన విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలులో డీలిమిటేషన్ ప్రక్రియ అనివార్యమని ఆయన స్పష్టం చేశారు. పూర్తిస్థాయి జనాభా లెక్కల (సెన్సెస్) ప్రక్రియ పూర్తి కావడానికి సమయం పడుతుందని, క్షేత్రస్థాయి అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండానే ఈ నిర్ణయం తీసుకున్నామని, ఇందులో ఎటువంటి రాజకీయ కుట్ర లేదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇదే సమయంలో రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలపైనా ఆయన విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ఒక కార్పొరేషన్ పదవి భర్తీ చేయాలన్నా కూడా ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లి అధిష్టానానికి కట్టలు మోయాల్సిన పరిస్థితి ఉందని ఆరోపించారు. బీజేపీ విధానం అలా ఉండదని, ముఖ్యమంత్రి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

## పోచారం గారు ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకోండి

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు**

**నిజామాబాద్, ఏప్రిల్13 :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఇబ్బందులు ఉన్న విషయం పోచారం శ్రీనివాస్ రెడ్డికి తెలుసని అన్నారు. కొంచెం ఓపిక పట్టాలని, త్వరలోనే అన్నీ సర్దుకుంటాయని స్పష్టం చేశారు. కేటీఆర్ రెండు విషయాలు స్పష్టంగా ఒప్పుకున్నారని.. దోపిడీ దౌర్జన్యం చేశామని అంగీకరించారని మహేశ్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పాదయాత్ర చేయవచ్చని.. స్వాగతిస్తామని తెలిపారు. అయితే పాదయాత్రలో ప్రజలకు వాస్తవాలు చెప్పాలని సూచించారు. గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు. సింగరేణిలో విద్యుత్ కొనుగోళ్లలో బీఆర్ఎస్ అవినీతి చెరిపేస్తే చెదిరేది కాదని వ్యాఖ్యానించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి భారతీయ జనతా రాష్ట్ర సమితిగా మార్చినా తమకు ఇబ్బంది లేదని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని ధీమా వ్యక్తం చేశారు. కవితకు తమకు ఏంటి సంబంధం అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పార్టీ పెట్టుకున్నా స్వాగతిస్తామన్నారు. వారి కుటుంబ వాటాల పంచాయితీని తమపై అంటగట్టవద్దని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## గంజాయి అమ్ముతున్న టెక్కీ పట్టివేత

**హైదరాబాద్, ఏప్రిల్13 :** డబ్బు సంపాదించేందుకు అక్రమ మార్గం ఎంచుకున్నాడో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. మరో వ్యక్తితో కలిసి నగరంలో గంజాయి విక్రయాలు మొదలుపెట్టాడు. ఆ ఇద్దరిని పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి నానక్‌రామ్ గూడలో గంజాయి విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టయింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రేమానంద్ మల్లిక్, క్యాబ్ డ్రైవర్ విశాల్‌ను శేర్లింగంపల్లి ఎస్‌ఓటి, గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాకు చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ప్రేమానంద్ మల్లిక్, డ్రైవర్ విశాల్‌ను అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 2.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించారు. కాగా వీరికి గంజాయి అమ్మిన రాఘవేంద్ర, ఆకాశ్ పరారీలో ఉన్నారు. వీరి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మల్కాజిగిరి కార్పొరేషన్‌కు శాశ్వత భవనం నిర్మాణం

**రూ. 98 కోట్లకు ప్రభుత్వ అనుమతి**

**ఉప్పల్‌లో 10 ఎకరాల్లో ఆధునిక కార్యాలయం**

**పౌరసేవలు మరింత సమర్థవంతం**

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్/ :**
ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు శాశ్వత కార్యాలయ భవనం నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ. 98 కోట్ల పరిపాలనా అనుమతిని మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉప్పల్ భాగయాత్ లేఅవుట్ ఫేజ్- 3 లో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ కార్యాలయం ద్వారా మున్సిపల్ సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా ప్రజలకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. త్వరలోనే ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి మరియు సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పల్ అభివృద్ధి కోసం మరిన్ని ప్రాజెక్టులు చేపట్టేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

## గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలపై దాడులు

**రూ 1.50 కోట్ల విలువైన డొమెస్టిక్ సిలిండర్ల స్వాధీనం.**

**గత నెల రోజుల్లో 2,089 కేసులు నమోదు.**

**పౌరసరఫరాల శాఖ నిరంతర నిఘా**

**హైదరాబాద్,ఏప్రిల్13 :** గ్యాస్ సరఫరాలో గృహ వినియోగదారులకి ఎటువంటి ఇబ్బంది రాకుండా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నిరంతరం మానిటరింగ్ చేస్తున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గ్యాస్ సిలిండర్ల ను అక్రమ నిల్వ, పక్కదారి పట్టించే వారిపై అధికారులు నిఘా ఉంచి, ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. డొమెస్టిక్ సిలిండర్ల సరఫరా పక్రియ నిబంధనల ప్రకారం సకాలంలో జరిగేందుకు బుకింగ్స్ / డెలివరీలను కమాండ్ కంట్రోల్ ద్వారా ఆయా ఏజెన్సీ లతో రోజువారీగా చెక్ చేస్తున్నారు. గత నెల రోజులుగా నిర్వహించిన దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న, నిల్వ ఉంచిన 5,079 డొమెస్టిక్ సిలిండర్లు, మరో 70 చిన్న సిలిండర్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ 1 కోటి 50 లక్షలు ఉన్నది. ఈ సందర్భంగా 2,089 కేసులు నమోదు చేశారు. వీరిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టారు. గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వ, తరలింపు, డెలివరీ లో జాప్యంపై రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్:1967 కు ఫిర్యాదు చేయాలని ప్రభుత్వం సూచించింది.

## మొబైల్ ఫోన్ల కొనుగోళ్లపై అసత్య ప్రచారాలు

**కెసిఆర్‌కు లీగల్ నోటీసులు పంపిన సీతక్క**

**హైదరాబాద్,ఏప్రిల్13 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపించారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా చేస్తున్న తప్పుడు ఆరోపణలకు కేసీఆర్ బాధ్యత వహించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. సోమవారం 13న రిజిస్టర్ పోస్టు ద్వారా కేసీఆర్ కు లీగల్ నోటీసులు పంపించారు సీతక్క. సీతక్క తరుపు అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్ పోస్టు ద్వారా కేసీఆర్ కు లీగల్ నోటీస్ పంపించారు. అంగన్వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టకు భంగం వాటిల్లేలా బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతోందని.. అందుకు కేసీర్ బాధ్యత వహించాలనంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు పక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిందని తెలిపారు. టెండర్ ఇవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ ఇవ్వడం జరిగిందని, ఇందులో తనకు ఎలాంటి సంబంధం లేదని నోటీసులో స్పష్టం చేశారు. మొత్తం టెండర్ విలువ 44 కోట్ల రూపాయలే ఉన్నప్పటికీ, అందులో రూ. 30 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం అసంబద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు లేని ఆరోపణగా పేర్కొన్నారు.

ఖా పార్టీ అఫీషియల్ సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారానికి కేసీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తన ప్రతిష్టను దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని నోటీసులో పేర్కొన్నారు మంత్రి సీతక్క. 48 గంటల్లో పోస్టులు తొలగించి కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే సివిల్, క్రిమినల్

# ప్రభుత్వంపై బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం తిరుగుబాటు

- సిద్దాపూర్ రిజర్వాయర్ పనులకు నిధులు మంజూరు చేయడం లేదంటూ వద్ద ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తున్న పోచారం.
- ముఖ్యమంత్రి ఇచ్చిన మాట తప్పిండు.

తెలంగాణ సిద్దాపూర్/ఏప్రిల్ 13/(జన సంఘర్షణ)



బారాస ఎమ్మెల్యేగా కొనసాగుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 6 నెలల్లో బారాసకు గుడ్ బై చెప్పి కాంగ్రెస్లోకి చేరిపోయారు పోచారం శ్రీనివాస్ రెడ్డి. గతంలో బారాస నాయకులు, కార్యకర్తలు చేరికపై ప్రశ్నించగా తాను నియోజకవర్గం అభివృద్ధి కోసం చేరుతున్నానని చెప్పి కాంగ్రెస్ పార్టీతో బంధం పెంచుకున్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఒకటే ఉద్దేశం ఏదైనా అభివృద్ధికి ఏ పార్టీ నిధులు ఇవ్వడానికి సిద్ధమైతే ఆ పార్టీలో చేరడానికి పోచారం శ్రీనివాస్ రెడ్డి సిద్ధంగా ఉంటారు. ఎప్పుడు తన నియోజకవర్గం అభివృద్ధిని ఆకాంక్షిస్తూ తాను పనిచేస్తుంటారు. నాలుగు దశాబ్దాల కాలంగా బాన్సువాడ నియోజకవర్గాన్ని విద్య, వైద్య, వ్యవసాయ రంగంతోపాటు ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రంలోనే బాన్సువాడ నియోజకవర్గ రెండు పడక గదుల నిర్మాణంలో మొదటి స్థానంలో నిలిచింది. ఇంతమంది గూడు లేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చరు పోచారం. దీనిని దృష్టిలో పెట్టుకొని శేష జీవితంలో ఉన్న మరిన్ని అభివృద్ధి పనులు నియోజకవర్గంలో చేపట్టడానికి కన్న తల్లి లాంటి బారాస పార్టీని వదిలి కాంగ్రెస్ లోకి వెళ్లారు. కాంగ్రెస్ లోకి చేరిన తర్వాత పోచారం శ్రీనివాస్ రెడ్డికి, రేవంత్ రెడ్డి సర్కార్ లో సముచిత స్థానం దక్కటం లేదు, కేవలం రాష్ట్రాన్ని ఏలుతున్నది ముఖ్యమంత్రితో పాటు ఐదుగురు మంత్రులు మాత్రమే. మిగతా వారంతా డమ్మీగా ఉన్నారు. తన నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరితే మరింత అభివృద్ధి చెందుతుందని, ఎంతో ముందు ఆలోచనతో కాంగ్రెస్లోకి చేరిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి, జగిత్యాల మాజీ మంత్రి మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరిస్థితి ఎదురవుతుంది. అభివృద్ధి కోసం పార్టీలో చేరితే పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఒక సీనియర్ నాయకుడిగా గుర్తించకుండా నియోజకవర్గంలో అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడ్డు తగులుతున్నారు. నియోజకవర్గంలో 50 శాతం రెండు పడక గదులు స్లాబ్ లెవల్, పిల్లర్లతో నిలిచిపోయాయి. కొద్దిపాటి నిధులు ఇస్తే వేల మందికి సొంతింటి కల నెరవేర్చే అవకాశాలు ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి సర్కార్ అభివృద్ధి కోసం నిధులు ఇవ్వకపోవడంతో, ఇప్పటివరకు ఎదురుచూసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి , ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారు. పదివేల ఎకరాలకు సాగునీరు అందించే సిద్ధపూర్ రిజర్వాయర్కు కావలసిన నిధులు ఇవ్వడంలో రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం చేయడం, నిధులు మంజూరు చేయకపోవడంతో రేవంత్ రెడ్డి సర్కార్ నిధులు ఇస్తుందని ఎంతో ఆశించినప్పటికీ ప్రభుత్వం నుంచి నయా పైసా నిధులు విడుదల కాకపోవడంతో, ఆదివారం సాయంత్రం సిద్దాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించడానికి వెళ్లారు. నిధులు లేక పనులు ముందుకు సాగడం లేదని తెలుసుకున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి ఒకేసారి కాంగ్రెస్కు ప్రభుత్వంపై మండిపడ్డారు. నిధులు ఇవ్వడం లేదంటూ పోచారం శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.

ఈ వయస్సులో నిధులు మంజూరు చేయాలని మంత్రుల కాళ్లు మొక్కన్న అంటూ అసహనం వ్యక్తం చేశారు. మంత్రికి 20 సార్లు చెప్పా నిధులు మంజూరు చేయాలని అయినా పట్టించుకోలేదు అంటూ పోచారం ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఇంట్లో కూర్చుంటే జీవోలు వచ్చాయి, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పోచారం ఆరోపించారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా, ఉంటే పనిచేస్తుందా? అంటూ ప్రభుత్వం పై పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎదురు దాడికి దిగడంతో ఒకేసారి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రాజకీయంలో చర్చ మొదలైంది. తెలంగాణ రాష్ట్రానికి మంత్రిగా, శాసన సభాపతిగా విధులు నిర్వహించడమే కాకుండా వయసు పరంగా పెద్దాయన పోచారం శ్రీనివాస్ రెడ్డి. కనీసం ఆయన వయసుకు కూడా రేవంత్ రెడ్డి సర్కార్ గౌరవం ఇవ్వకపోవడం పట్ల గత గులాబీ నేత వారికి ఏ విధంగా సహకరించారు ఇప్పుడు వారు గుర్తు చేసుకుని, ఎందుకు పార్టీ మారాము అన్న బాధ వ్యక్తం చేస్తున్నారు పోచారం శ్రీనివాస్ రెడ్డి.

# కన్నుల పండువగ శ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రాణప్రతిష్టపన

- హాజరైన స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్ సాయినాథ్ మహరాజ్

ముథోల్, ఏప్రిల్ 13 (జన సంఘర్షణ)

మండల కేంద్రమైన ముథోల్‌లోని తహసిల్ కార్యాలయం వెనుక గల నాందేడ్ గల్లిలో నూతనంగా నిర్మించిన దత్త మందిరం, శ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహం ప్రాణ ప్రతిష్టపన ఉత్సవాలు కన్నుల పండువగ జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్టపన మహోత్సవం నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు విగ్రహ ఊరేగింపు తో పాటు రెండవ రోజు మందిర ప్రారంభం, దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్టపన ఉత్సవాలు, చివరి రోజు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహారాష్ట్ర ప్రభుత్వ స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్ సాయినాథ్ మహరాజ్ వస్మత్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు మొక్కలను పెంచాలని సూచించారు. అదేవిధంగా విద్యను ప్రోత్సహిస్తూ మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ భూగర్భ జలాలు పెంచే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మహిళల ఉన్నతికి కృషి చేయాలని అన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడంతోపాటు రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక జ్ఞానంతోనే ఉన్నతమైన జీవితాన్ని పొందవచ్చని తెలిపారు. స్థానిక భక్తుల ఐక్యతతో మందిర నిర్మాణంతో పాటు విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవాన్ని కన్నుల పండుగ నిర్వహించడం ఆనందంగా ఉందని



పేర్కొన్నారు. గ్రామస్తులందరూ కలిసికట్టుగా ఉంటూ ముందుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీడీసీ అధ్యక్షుడు వరగంటి విటల్, భక్తులు భీమ్రావు పటేల్, మాధవరావు పటేల్, ఆనంద్ రావు పటేల్, పోతన్న, రాగోబా పటేల్, మాజీ ఎంపీటీసీ దేఓజి భూమేష్, గ్రామ పెద్దలు బయమొల్ల గంగాధర్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి పునరేకీకరణ పోరులో మేకల విజయ్ వర్మ గళం

- ఐదు గ్రామాల విలీనం ఒక చారిత్రక అవసరం!
- ఒక పట్టణం శ్వాస ఆగిపోతుంటే.. ఒక తరం భవిష్యత్తు చిధ్రమవుతుంటే..

భద్రాచలం ఏప్రిల్ 13 (జన సంఘర్షణ)

రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం దాటినా, భద్రాద్రి రామయ్య సాక్షిగా జరిగిన ఒక 'భౌగోళిక అన్యాయం' నేటికీ పచ్చి పుండులా వేధిస్తూనే ఉంది. నాడు రాజకీయ చదరంగంలో గీసిన అశాస్త్రీయ రేఖలు, నేడు ఒక చారిత్రక పట్టణ వృద్ధిని ఉరి తీయడమే కాకుండా, వేల గిరిజన కుటుంబాల బతుకులను అగాధంలోకి నెట్టేశాయి. ఈ నేపథ్యంలో భద్రాచలంలో నిర్వహించిన 'భద్రాద్రి పునరేకీకరణ విస్తృతస్థాయి అఖిలపక్ష సమావేశం' కేవలం ఒక చర్చా వేదికగా మిగిలిపోకుండా, ఉమ్మడి పోరాట నినాదంగా మారింది. ఈ మహా సభలో పాల్గొన్న రాష్ట్ర టీఎస్జీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసిన యువ నాయకులు మేకల విజయ్ వర్మ, ఈ సమస్యలోని మానవీయ కోణాన్ని, అభివృద్ధి అడ్డంకులను ఎండగట్టిన తీరు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది.



**ఊపిరాడని పట్టణం:**

భద్రాచలం చుట్టూ ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను ఏపీలో విలీనం చేయడం వల్ల, పట్టణ విస్తరణకు ఇసుమంతైనా అవకాశం లేకుండా పోయింది. పర్యాటకంగా అంతర్జాతీయ స్థాయికి ఎదగాల్సిన ఈ పుణ్యక్షేత్రం, నేడు ఇరుకైన సరిహద్దుల మధ్య ఇరుక్కుపోయి వృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది.

రెంటికీ చెడ్డ రేవడిలా గిరిజన బతుకులు: "అక్కడ ఓటు.. ఇక్కడ బతుకు" అన్న చందంగా ఆ ఐదు గ్రామాల ప్రజల పరిస్థితి తయారైంది. వారి నిత్య అవసరాలకు, అత్యవసర వైద్యానికి, పిల్లల చదువుకు భద్రాచలమే ఆధారం. కానీ పాలనాపరంగా వారు ఆంధ్రప్రదేశ్‌లో ఉండటంతో, అటు తెలంగాణ పథకాలు అందక, ఇటు ఏపీ సౌకర్యాలు పొందే వీలులేక వారు తమ ఉనికిని కోల్పోతున్నారు.



మేకల విజయ్ వర్మ

ఆత్మగౌరవ ప్రశ్న: ఇది కేవలం భూభాగం కోసం చేస్తున్న పోరాటం కాదు, వేల సంఖ్యలో ఉన్న గిరిజన కుటుంబాల ఆత్మగౌరవ ప్రశ్న. తమ మూలాలు ఉన్న ప్రాంతం నుంచి బలవంతంగా వేరు చేయబడిన ఆ ప్రజల ఆవేదనను విజయ్ వర్మ అత్యంత ప్రభావవంతంగా సమావేశం ముందు ఉంచారు.

రాజకీయ నిర్ణయాలు ప్రజల సౌలభ్యం కోసం ఉండాలి కానీ, వారిని ఇబ్బందుల పాలు చేసేలా ఉండకూడదు. "భద్రాద్రి రామయ్య పాదాల సాక్షిగా జరుగుతున్న ఈ అన్యాయాన్ని సరిదిద్దకపోతే, చరిత్ర మనల్ని క్షమించదు" అని విజయ్ వర్మ హెచ్చరించిన తీరు, ఈ ఉద్యమం రాబోయే రోజుల్లో ఎంత ఉధృతం కాబోతుందో సూచిస్తోంది. ఐదు గ్రామాల పునరేకీకరణ అనేది కేవలం డిమాండ్ కాదు.. అది భద్రాద్రి మనుగడకు అత్యవసరమైన శస్త్రచికిత్స!

# జనగామలో ఆరైవ్ - అలైవ్ కార్యక్రమం

కామారెడ్డి బీబీపేట్ ఏప్రిల్ 13( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా, బీబీపేట్ మండలం లోని జనగామ గ్రామంలో ఆరైవ్ ఆలైవ్ కార్యక్రమం నిర్వహించిన బీబీపేట్ ఎస్ ఐ కొండా విజయ్. ఈ సందర్భంగా ఆయన రోడ్డు ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రోడ్డు ప్రయాణంలో అందరూ తప్పకుండా ట్రాఫిక్ నియమాలను పాటించాలని , హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి మొబైల్ ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్ట శ్రీనివాస్, పాలకవర్గం, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తానూర్‌లో గ్రామ సభ - ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

తానూర్, ఏప్రిల్ 13 (జన సంఘర్షణ)



తానూర్: తానూర్ మండల కేంద్రంలో ఈ రోజు గ్రామ స్థాయి గ్రామ సభను నిర్వహించారు. ఈ సమావేశంలో అరైవ్ అలైవ్ ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంపై గ్రామ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. అదేవిధంగా, గ్రామ స్థాయిలో ట్రాఫిక్ భద్రతపై నిరంతర అవగాహన కల్పించేందుకు గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో రిటైర్డ్ ఉద్యోగులు, వైద్యులు, ఆశా వర్కర్లు సభ్యులుగా చేర్చబడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్సై షేక్ జుబేర్, తానూర్ సర్పంచ్ సుగంధ గారు, ఉప సర్పంచ్ మరియు వార్డ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై షేక్ జుబేర్ మాట్లాడుతూ, "ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ ఉపయోగించడం వంటి చిన్న జాగ్రత్తలు పెద్ద ప్రమాదాలను నివారిస్తాయి. మద్యం సేవించి వాహనం నడపడం పూర్తిగా మానుకోవాలి. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయి" అని సూచించారు. ఇంకా, ప్రజల సౌకర్యార్థం తానూర్ మండల కేంద్రంలోని రోడ్లపై ఉన్న గుంతలను మరమ్మతు చేయడం జరిగింది.

# కుల బహిష్కరణ చేసిండ్రు న్యాయం చేయండి

- సబ్ కలెక్టర్కు ఫిర్యాదు
- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన

బోధన వర్ని/ఏప్రిల్ 13/(జన సంఘర్షణ,)



నిజామాబాద్ జిల్లా వర్ని మండలం కూనిపూర్ గ్రామానికి చెందిన రవుట్ల శ్రీనివాస్ తనకు కులం నుంచి బహిష్కరించడం జరిగిందని తన ఇంటికి ఎవరికీ రానివ్వడం లేదని తాము ఎవరి ఫంక్షన్ కైనా వెళ్తే ఎవరిని రానీయడం లేదని కులంలో కొంతమంది తన కుటుంబం పై కక్ష సాధింపులు సాధించి కుల బహిష్కరణ చేయడం జరిగిందని తమకు న్యాయం చేయాలని కోరడం జరిగింది .ఈ సందర్భంగా వర్ణి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని అందులో భాగంగా బోధన్ సబ్ కలెక్టర్కు ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని అన్నారు. తనకు గత కొన్ని సంవత్సరాల నుంచి కులంలో కొంతమంది ఇబ్బందులు పాలు చేస్తున్నారని, తాను గత 30 సంవత్సరాల నుంచి కబ్జాలో ఉన్న పశువుల కొట్టం కై కొంత మంది కన్ను పెట్టి తన జీవనాధారం ఉన్న కొట్టం జాగ అప్పజెప్పాలని లేని పక్షంలో దాడులు చేస్తామని దాడులు కూడా చేయడం జరిగిందని ఈ విషయంలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చిన న్యాయం జరగలేదని అన్నారు. అంతే కాకుండా కులం నుంచి బహిష్కరించడం జరిగిందని తనకు న్యాయం చేయాలని కోరడం జరిగింది. గతంలో అనేకమార్లు సుమారు మూడు సంవత్సరాల నుంచి ఫిర్యాదు ఇస్తూనే ఉన్నానని తనకు న్యాయం కావాలని లేని పక్షంలో రిలే లేక ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరికలు చేశారు.

# 24వ వార్డులో సీమంత-అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహణ


ఇల్లందు ప్రతినిధి( జన సంఘర్షణ )



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు సీమంత కార్యక్రమం, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ గహాజరై గర్భిణీ స్త్రీలకు ఆశీర్వాదాలు అందించారు. అలాగే ఇల్లందు సీడీపీఓ అరుణ కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగమయ్యారు. ఈ కార్యక్రమాన్ని 24వ వార్డు కౌన్సిలర్ చెనిగరపు శృతి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సిబ్బంది చైర్‌పర్సన్ కౌన్సిలర్‌లను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో సూపర్వైజర్ ధనలక్ష్మి, సక్కుబాయి, అంగన్వాడి టీచర్లు నాగలక్ష్మి, దేవమణి, లక్ష్మీకాంత్, ఆయాలు సుప్రియ, కరుణ కుమారి చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులోని మహిళలు, చిన్నారులు, పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గర్భిణీల ఆరోగ్యం, శిశు సంక్షేమం, విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

# కోటగిరి పోలీస్ మిస్సింగ్ కేస్ నమోదు

కోటగిరి/ఏప్రిల్ 13/(జన సంఘర్షణ)



కోటగిరి మండల కేంద్రంలో గోపి సాయిలు (30), కులం: ఎస్సీ-మాదిగ, గ్రామం : కోటగిరి అను అతను తన భార్యతో పాటుగా ఆర్మూర్లో నివసిస్తూ ఉంటాడు. తేదీ 12-4-2026 రోజున కోటగిరికి వచ్చి తిరిగి రాత్రి 8 గంటలకు ఆర్మూర్‌కు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్ళినాడు. తిరిగి ఇంటికి రాలేదు కావున అతని తల్లి అయిన గోపి అనూష దరఖాస్తు ఇవ్వగా మిస్సింగ్ కేసు నమోదు చేయడం జరిగింది.

జన సంఘర్షణ

మంగళవారం
14 ఏప్రిల్ 2026

# బాన్సువాడలో పోచారంకు... జగిత్యాలలో జీవన్ రెడ్డికి

- ఇక్కడ బారాస ఎమ్మెల్యేకు.. అక్కడ కాంగ్రెస్ మాజీ మంత్రికి
- కాంగ్రెస్లో పొగ పెట్టి వెళ్ళగొడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి
- ఇప్పటికే పార్టీని వదిలిన జీవన్ రెడ్డి.. మరి పోచారం దారి ఎటు?





బాన్సువాడ/ఏప్రిల్ 13/(జన సంఘర్షణ)

కన్నా తల్లి లాంటి పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలోకి అభివృద్ధి కోసం చేరితే, ఆ పార్టీలో సీనియర్ నాయకుల పై, ఎమ్మెల్యేలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు, మంత్రులు చిన్నచూపు చూడడం వారు పార్టీలో ఎందుకు చేరాము అన్న బాధ వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో జరిగిన సంఘటన మళ్లీ అదే రిపీట్ అయింది బాన్సువాడలో. 42 ఏళ్లుగా సుదీర్ఘంగా కాంగ్రెస్ పార్టీ జెండా మోసి జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా, వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో క్యాబినెట్లో మంత్రిగా జీవన్ రెడ్డి పని చేశారు, జీవన్ రెడ్డికి జగిత్యాల జిల్లాలో మంచి పట్టు ఉంది. కన్నా తల్లి లాంటి పార్టీని పట్టుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయడం కాకుండా, జగిత్యాల నియోజకవర్గం లో జీవన్ రెడ్డి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. 2023 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న జీవన్ రెడ్డి, బారాస అభ్యర్థి సంజయ్తో పోటీపడి జీవన్ రెడ్డి ఓడిపోయారు. తాను ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, నియోజకవర్గంలో జిల్లాలో అభివృద్ధి పనులకు నిధులు తీసుకువచ్చే అవకాశం లభించిందంటూ జీవన్ రెడ్డి ఎన్నో ఆశలు కన్నారు. ఆయన ఆశలపై రేవంత్ రెడ్డి సర్కార్ నీళ్లు చల్లింది. జగిత్యాల నియోజకవర్గం బారాస ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్ కు, రేవంత్ రెడ్డి తోపాటు మంత్రులు అండగా నిలవడంతో, దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీని పట్టుకొని ఉంటున్న జీవన్ రెడ్డికి రోజురోజుకు ఆయన ఆధిపత్యం పై దెబ్బ తీస్తూ వచ్చారు. ఎన్నో ఏళ్లుగా సీనియర్ నాయకుడిగా మాజీ మంత్రిగా జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సేవలు చేశారు. అలాంటి వ్యక్తికి రేవంత్ రెడ్డి సర్కార్ చిన్నచూపు చూడడమే కాకుండా, జీవన్ రెడ్డికి పట్టు ఉన్న జగిత్యాల జిల్లాలో రేవంత్ రెడ్డి సర్కార్, జీవన్ రెడ్డికి అడుగడుగునా అడ్డుపడుతూ ఆయన రాజకీయ భవిష్యత్తుకు, ఆయనని నమ్ముకున్న ప్రజల్ని రేవంత్ రెడ్డి సర్కిల్ దూరం చేసింది. ఎన్నో ఏళ్లుగా పార్టీని పట్టుకుని ఉంటున్న జీవన్ రెడ్డికు జగిత్యాల జిల్లాలో పార్టీలో సముచిత స్థానం ఇవ్వకుండా బారాస నుంచి కాంగ్రెస్లోకి వలస వచ్చిన ఎమ్మెల్యే సంజయ్కు ప్రాముఖ్యత ఇవ్వడంతో, జగిత్యాల జిల్లాలో జీవన్ రెడ్డికి ప్రాధాన్యత తగ్గిస్తూ ఎమ్మెల్యే సంజయ్కు ప్రాముఖ్యత ఇవ్వడంతో, పలుమార్లు జీవన్ రెడ్డి, రేవంత్ రెడ్డి సర్కార్పై అధిష్టానానికి ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో చివరికి పార్టీ మారల్సిన పరిస్థితి వరకు తీసుకువచ్చారు కాంగ్రెస్ పెద్దలు. ఇదే పరిస్థితి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి నెలకొంది. బారాస బీఫామ్ పై ఎమ్మెల్యేగా విజయం సాధించిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 6 నెలల్లోనే కన్న తల్లి లాంటి బారాస పార్టీని వదిలి తన నియోజకవర్గం అభివృద్ధి కోసం ఏమైనా నిధులు తీసుకురావచ్చు అన్న ముందుచూపు, ఆలోచనతో కాంగ్రెస్ పార్టీలోకి అడుగుపెడితే, కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రితో పాటు, మంత్రులు పోచారం శ్రీనివాస్ రెడ్డికి తగిన ప్రాధాన్యత పార్టీలో చోటు కల్పించడం లేదు. నిధులు ఇస్తానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మర్చిపోయాడు. అభివృద్ధి కోసం పార్టీ మారితే తన పరిస్థితి ఇలాగ మారుతుందని అనుకోలేదని పోచారం రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలోకి చేరితే కాంగ్రెస్ పార్టీలో తనకు ముఖ్యమంత్రితో పాటు, మంత్రులు ఫోన్ చేస్తే ఫోన్ కూడా మాట్లాడే పరిస్థితి లేదు అంటూ పోచారం శ్రీనివాస్ రెడ్డి తన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పోచారం శ్రీనివాస్ రెడ్డి తన నియోజకవర్గం అభివృద్ధి కోసం పార్టీ మారితే ఆయనకు చివరికి ఒక పెద్ద మనిషిగా, సీనియర్ నాయకులుగా గుర్తించవలసింది పోయి రేవంత్ రెడ్డి సర్కార్ పోచారంపై చిన్నచూపు చూస్తుంది. 1994 నుంచి తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యేగా విజయం సాధించి, అప్పటినుంచి ఒక్కసారి 2004 లో కాంగ్రెస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పై ఓటమి పాలయ్యారు. తర్వాత వరుసగా విజయం సాధిస్తూ, మంత్రిగా, శాసనసభపతిగా విధులు నిర్వహించిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి , కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా దెబ్బతిస్తుంది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అనుకున్న స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో స్థానం దక్కడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అంటే పేరు తెలియని వ్యక్తులంటూలేరు. తెలంగాణ రాష్ట్రంలోనే బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగంలో అభివృద్ధి చేసిన ఘనత పోచారం శ్రీనివాస్ రెడ్డికి దక్కింది. శ్రీనివాస్ రెడ్డి అంటే ఆయనకు ప్రజలతో నేరుగా మాట్లాడే అవకాశం కల్పించుకుంటారు. ఎప్పుడు ప్రజల్లో ఉంటూ ప్రజల కష్టనష్టాలను తెలుసుకుంటూ, సమయం దొరికినప్పుడల్లా ఏదో ఒక గ్రామానికి వెళ్లడం ఆ గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకోవడం వాటిని పరిష్కారం మార్గం చూపిస్తూ తెలంగాణ రాష్ట్రంలోనే ఒక గొప్ప ఎమ్మెల్యేగా పోచారం శ్రీనివాస్ రెడ్డికి పేరు దక్కింది. అలాంటి వ్యక్తి శేష జీవితంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరడమే పెద్ద తప్పుగా మారింది. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆలోచించింది వేరు ,అక్కడ జరుగుతుంది మరొకటి. ఉద్దేశపూర్వకంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదిపత్యం కాంగ్రెస్ పార్టీలో తగ్గించాలని ప్రయత్నంతో ఈ ప్రయత్నాలు సాగుతున్నాయి. జగిత్యాల జిల్లాలో మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవన్ రెడ్డి పరిస్థితి ఇదేవిధంగా మారితే ఆయన ఏకంగా రేవంత్ రెడ్డి పై దుమ్మెత్తి పోసి పార్టీ కి గుడ్ బై చెప్పి బారాసలోకి చేరిపోయారు. ఇదే పరిస్థితి పోచారం కు బాన్సువాడలో నెలకొంది. కాంగ్రెస్ అధిష్టానం పోచారం పట్ల సంతృప్తి కనిపించడం లేదు. ఆయన సేవలు పార్టీకి అవసరం లేని విధంగా అధిష్టానం పనిచేస్తుంది. రెండేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న పోచారం శ్రీనివాస్ రెడ్డికి రెండు ఏళ్లలో రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానం పార్టీలో సముచిత స్థానం కల్పించకపోవడంతో చివరికి పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం పై ఎదురు దాడికి దిగుతున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను, బారాస పార్టీలో చేర్పించుకోమని మాజీ ముఖ్యమంత్రి గులాబీ నేత కేసీఆర్ ఇటీవల ప్రకటించారు. పోచారం పార్టీ మారితే ఎటు వెళ్లతారు? అన్నది నియోజకవర్గంలో ఒక చర్చ జరుగుతుంది. ఎటు బారాస రానివ్వదు, అటు కాంగ్రెస్ పార్టీలో ఉండనివ్వదు మరి పోచారం శ్రీనివాస్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు ఏమిటి అని? విశ్లేషకులు భావిస్తున్నారు.

# డిగ్రీ కళాశాలలో ఘనంగా వీడ్కోలు పార్టీ




ఎల్లారెడ్డి, ఏప్రిల్ - 13(జన సంఘర్షణ )

ఎల్లారెడ్డి మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఫేర్వెల్ పార్టీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో మొదటగా కళాశాల అధ్యాపకులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కలిసి తృతీయ సంవత్సరం విద్యార్థులకు వేడుకలు పలికారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని విద్యార్థులు తమ కమ్యూనికేషన్ నైపుణ్యలను మెరుగుపరచుకొని మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించుకొని క్రమ పద్ధతిలో శ్రమిస్తే విజయం సాధించవచ్చని తెలిపారు. అనంతరం కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు విద్యాసాగర్ మాట్లాడుతూ.. అబ్బాయిలు, అమ్మాయిలు సరి సమానమైన పోటీలో నిలుస్తున్నారని, మంచి ఉన్నతమైన స్థానాలు ఉద్యోగం తెచ్చుకొని మంచి భవిష్యత్తుకు నాంది పలకాలని కోరారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ సంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకుని విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, మున్సిపల్ కౌన్సిలర్లు సయ్యద్ గఫర్, ఎరుకల దశరథం, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు మంచిర్యాల విద్యాసాగర్, సొసైటీ వైస్ చైర్మన్ మతమల ప్రశాంత్ గౌడ్, అధ్యాపకులు చంద్రకాంత్,రాణి, నాగనిక, అరుణ్ కుమార్, సిద్దు రాజు, గంగారెడ్డి, శశిధర్, కిరణ్ కుమార్, స్వప్న, వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రత.. ప్రతి ప్రాణం వెలకట్టలేనిది!



ఇల్లందు ఏప్రిల్ 13 (జన సంఘర్షణ)

విజయలక్ష్మి నగర్ గ్రామ పంచాయతీ వేదికగా జరిగిన '99 రోజుల ప్రణాళిక' గ్రామసభ కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా, సామాజిక బాధ్యతను గుర్తుచేసే వేదికగా నిలిచింది. సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ రోడ్డు భద్రత అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. "రహదారిపై మనం పాటించే అతి చిన్న జాగ్రత్త, ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతుందని" అత్యంత భావోద్వేగంతో ఉద్ఘాటించారు. కేవలం వాహనం నడపడం మాత్రమే కాకుండా, ట్రాఫిక్ నిబంధనలను ఒక క్రమశిక్షణగా భావించాలని, అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు కంగారు పడకుండా తక్షణమే ఆరోగ్య సిబ్బందిని (108) మరియు పోలీసు శాఖను అప్రమత్తం చేయడం ద్వారా బాధితులకు సకాలంలో ప్రాణదానం చేయవచ్చని ఆయన దిశా నిర్దేశం చేశారు. పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్, వార్డు సభ్యులు మరియు గ్రామ యంత్రాంగం సమక్షంలో జరిగిన ఈ సభ, "జాగ్రత్తే ప్రాణవాయువు" అనే సందేశాన్ని గ్రామస్థుల మనసుల్లో బలంగా నాటింది.

## ఆత్మ కమిటీ చైర్మన్ని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 13 (జన సంఘర్షణ )




నూతనంగా ఆత్మ కమిటీ చైర్మన్గా ఎన్నికైన సందర్భంగా జరుప్ల దశరథ నాయక్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కురుమ సాయిబాబా, సాయిలు, అలాగే మండలంలోని సీనియర్ నాయకులు పాల్గొని దశరథం నాయక్ ను అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా దశరథం నాయక్ మాట్లాడుతూ..తాను ఆత్మ కమిటీ చైర్మన్గా నియమితులైనందుకు ఎంతో ఆనందంగా ఉందని, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన శాసనసభ్యులు మదన్ మోహన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజలకు సేవ చేస్తూ, తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని చెప్పారు. శాసనసభ్యులు మదన్ మోహన్ నిరంతరం కృషి చేసి నాయకులను ప్రోత్సహిస్తూ, వారికి ఉన్నత అవకాశాలు కల్పిస్తున్నందుకు మండల నాయకులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# ఇల్లందు మున్సిపల్ కో-ఆప్షన్ కొలువు

- పట్టణ ప్రగతిలో నూతన అధ్యాయం!



ఇల్లందు ఏప్రిల్ 13 (జన సంఘర్షణ)

ఇల్లందు మున్సిపాలిటీ వేదికగా సోమవారం నిర్వహించిన కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ కేవలం ఒక అధికారిక లాంఛనంగా కాకుండా, పట్టణ సమగ్ర అభివృద్ధికి పునరంకితమయ్యే ఒక కీలక ఘట్టంగా నిలిచింది. స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశంలో, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన మాజీ కౌన్సిలర్లు మడుగు సాంబమూర్తి, పరె స్వర్ణలత, సయ్యద్ ఆజాంలతో పాటు షేక్ హసీనాలను సభ్యులుగా ఎన్నుకోవడం ద్వారా కౌన్సిల్కు కొత్త శక్తి చేకూరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదవులు కేవలం అలంకారప్రాయం కాదని, ప్రజా సమస్యల పరిష్కారంలో కో-ఆప్షన్ సభ్యులు వారధిలా మారి ఇల్లందు పట్టణ రూపురేఖలను మార్చడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, వైస్ చైర్మన్ పెండేలా రాజు, కమిషనర్ సమక్షంలో జరిగిన ఈ ఎన్నిక, ప్రజాస్వామ్య బలాన్ని చాటుతూనే.. "అధికారం అంటే బాధ్యత" అనే సందేశాన్ని కొత్తగా ఎన్నికైన సభ్యులకు గుర్తుచేసింది. పట్టణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పథంలో నడవడమే ఈ నూతన సభ్యుల ముందున్న అసలైన సవాలు.

## మాజీ కో ఆప్షన్ సామాజిక సేవ కార్యకర్తకి ఘనంగా సన్మానం



పొతంగల్ చైతన్ నగర్/ఏప్రిల్ 13/(జన సంఘర్షణ)

పొతంగల్ మండల కేంద్రంలో మాజీ కో ఆప్షన్ సామాజిక సేవ కార్యకర్తకి ఘనంగా సన్మానం. ఈరోజు గ్రామ చైతన్ నగర్ గ్రామ శివాలయంలో మాజీ ఉప సర్పంచ్ నరసింహులు, ప్రస్తుతం సర్పంచ్ సునీల్, డాక్టర్ ఎంఏ హకీమ్ కి వారితో పాటు జల్లపల్లి మాజీ సర్పంచ్ షేరు హంగర్గ, మాజీ సర్పంచ్ ఎజాజ్ ఖాన్కి, వలికి సన్మానించారు. వీరితో పాటు తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నర్సుల్లాబాద్ విద్యార్థినికి స్టేట్లో మూడవ ర్యాంక్

- ఇంటర్మీడియట్ రెండవ ఏడాదిలో 1000 మార్కులకు 993 మార్కులు సాధించిన శ్రీలక్ష్మి శ్రేష్ట



నస్రుల్లా బాద్/ఏప్రిల్ 13/(జన సంఘర్షణ)

కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన శ్రీ లక్ష్మి శ్రేష్ట ఇంటర్మీడియట్ రెండవ ఏడాదిలో ఎంపీసీలో 1000 మార్కులకు గాను 993 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మూడవ స్థానం సాధించింది. తల్లి మయూరి ఉపాధ్యాయ వృత్తిలో ఉండగా తండ్రి నర్సింలు ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ముగ్గురు ఆడపిల్లల్ని ఉన్నత చదువులు చదివించారు. మొదటి పాప వైద్య వృత్తిలో రాణిస్తుండగా, రెండవ పాప సాఫ్ట్వేర్ రంగంలో రాణిస్తున్నారు. మూడవ కూతురైన శ్రీ లక్ష్మి శ్రేష్ట హైదరాబాద్ ని నారాయణ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకుంది. 993 మార్కులతో మూడోస్థానం దక్కించుకుంది శ్రీ లక్ష్మి శేష్ట అనే విద్యార్థిని. తన కూతురు 993 మార్కులు సాధించినందుకు తల్లిదండ్రులు మయూరి, నర్సింలు అభినందించారు..

# రహదారి భద్రతపై మేయర్ మూడ్ గణేష్ సమరశంఖం

- హెల్మెట్ ధరించడం బాధ్యత.. నిబంధనలు పాటించడం ప్రాణరక్షణ!'
- రహదారి నిబంధన ప్రాణానికి శ్రీరామరక్ష




కొత్తగూడెం ఏప్రిల్ 13 (జన సంఘర్షణ)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' (99 రోజుల యాక్షన్ ప్లాన్)లో భాగంగా కొత్తగూడెం నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాలు సామాజిక స్పృహను కల్పించే వేదికగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ.. రహదారి నిబంధనలు పాటించడం అంటే కేవలం చట్టానికి భయపడటం కాదని, అది మన కుటుంబాల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమేనని అత్యంత లోతైన విశ్లేషణతో వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కార్లలో సీట్ బెల్ట్ కట్టుకోవడం వంటివి సామాన్యమైన అంశాలుగా కనిపిస్తున్నప్పటికీ, ప్రాణాపాయ స్థితిలో అవే మనల్ని రక్షణ ఇస్తాయని ఆయన గుర్తుచేశారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా బలిగొనవద్దని ఆయన హెచ్చరించారు. ఒక నగరం అభివృద్ధి చెందడం అంటే కేవలం భవనాలు రావడం మాత్రమే కాదని, పౌరులందరూ క్రమశిక్షణతో నిబంధనలు పాటించినప్పుడే అది నిజమైన ప్రగతి అని మేయర్ గణేష్ పేర్కొన్న తీరు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. ఒకటో పట్టణ సిఐ కరుణాకర్, మూడో పట్టణ సిఐ ఇంద్రసేన రెడ్డి మరియు ట్రాఫిక్ విభాగ అధికారుల సమక్షంలో జరిగిన ఈ సదస్సు, "సురక్షిత ప్రయాణం - సుఖమయ జీవనం" అనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది.

## మంత్రి నారా లోకేష్‌తో కలిసి రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

**నెల్లూరు జిల్లా- (జన సంఘర్షణ):**



ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి బిల్లును ఆమోదించినందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మంత్రి, యువ నాయకులు నారా లోకేష్ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సోమవారం ఈ మేరకు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతిని కలిసిన నారా లోకేష్ తో కలిసి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఇతర ఎంపీలు పాల్గొని రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కోట్ల ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేయడం తమకు దక్కిన ఒక గొప్ప అవకాశంగా అభివర్ణించారు. రాజధానిపై ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న స్పష్టతను తీసుకురావడంలో రైతుల అసాధారణ పట్టుదల, త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని కొనియాడారు.

## మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు


**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (జన సంఘర్షణ):**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరుని ఆలయ ఆవరణంలో గల మృత్యుంజయ స్వామికి సోమవారం పురస్కరించుకొని వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామివారిని వీభూది, కుంకుమ, గంధము, నారికేల, జలము, తేనే, పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం స్వామి వారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు.స్వామి వారు అత్యంత ఆకర్షితుడై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు.

## నేడు అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయండి

**కుప్పం,ఏప్రిల్ 13 (జన సంఘర్షణ):**




కుప్పంలో మంగళవారం జరగనున్న అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. సాయంత్రం 4 గంటలకి కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయముకు చేరుకొని అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరి 5 గంటలకు కుప్పం బస్టాండ్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని నివాళులు అర్పించే కార్యక్రమము ఉంటుందన్నారు. అర్బన్ పరిధిలోని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, జనసేన, బిజెపి నాయకులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా వెంకటేష్, నబి, సోమశేఖర్, శ్యాంసుందర్ లు తెలిపారు.

## ఈనెల 15 లోపు జలధార పనులను గుర్తించండి

◆ **జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**

**నెల్లూరు జిల్లా, ఏప్రిల్ 13 (జన సంఘర్షణ):**



జిల్లాలో నీటి వనరుల సమర్థ వినియోగం, భూగర్భ జలాల పెంపుదలకు జలధార-జలహారతి - సాగు నీటి సంఘాల బాధ్యత (జె జె యస్ యస్ బి) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నందు నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లాలో చేపట్టిన జలధార కార్యక్రమం పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ లోపు జలదార కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చెరువులు, చెక్ డ్యామ్ ల వద్ద అవసరమైన పనులను మండల, గ్రామ కమిటీల ఆధ్వర్యంలో గుర్తించాలని ఆదేశించారు. గ్రామస్తులు సూచించిన అన్ని పనులను కూడా పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. జిల్లాలో నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జలాల స్థాయిని పెంచేందుకు సమగ్ర, స్థిరమైన చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. దెబ్బతిన్న, లీకేజీ ఉన్న చెక్ డ్యామ్‌లను ప్రాధాన్యంతో పునరుద్ధరించడంతో పాటు, చెరువుల పటిష్టత మొదలైన పనులను గుర్తించాలన్నారు. సాగునీటి కాలువలలోని పూడికను తొలగించాలని, తూములు, కలుజుల మరమ్మత్తులు వేగవంతం చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, నిర్దిష్ట కాలంలో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ దేశ్ నాయక్, సోమశిల ప్రాజెక్ట్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ వెంకట రమణారెడ్డి, డ్వామా పిడి గంగాభవాని, జడ్పీ సీఈఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందులో 'సింగం' సురేష్ మార్క్ రోడ్డు భద్రత

◆ **'అరైవ్ అలైవ్' అంటే కేవలం నినాదం కాదు..**
◆ **అది మీ కుటుంబానికి ఇచ్చే ప్రాణ భరోసా.....**
◆ **సిఐ సురేష్**



రహదారిపై వాహనం నడుపుతున్నప్పుడు మనం ఇచ్చే ఒక చిన్న 'ఎక్సలరేటర్' మనల్ని గమ్యానికి చేరుస్తుందా లేక మన జీవిత ప్రయాణాన్నే ముగిస్తుందా? అనే ప్రశ్నకు సమాధానంగా నిలిచింది ఇల్లందులో జరిగిన 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం. పోలీస్ మరియు ఆర్టీసీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ సిఐ సురేష్ తనదైన శైలిలో వాహనదారుల కళ్లు తెరిపించారు.


**ప్రతిజ్ఞ చేయించిన 'సింగం':**

కేవలం ప్రసంగాలతో సరిపెట్టకుండా, సిఐ సురేష్ స్వయంగా రోడ్డుపైకి వచ్చి వాహనదారులందరితో రోడ్డు నిబంధనలపై ప్రతిజ్ఞ చేయించడం ఈ కార్యక్రమానికే హైలైట్‌గా నిలిచింది. "నిబంధనలు మనల్ని బంధించడానికి కాదు.. మనల్ని సురక్షితంగా మన ఇంటికి చేర్చడానికి" అని ఆయన అన్న మాటలు వాహనదారుల మనసును తట్టాయి. హెల్మెట్ అనేది తల మీద భారం కాదని, అది మన ప్రాణాలను రక్షించే కవచమని ఆయన గుర్తుచేశారు. చట్టానికి భయపడి కాదు, మన కుటుంబం కోసం మనం మారాలనే సందేశాన్ని ఆయన బలంగా పంపారు. ఈ సందర్భంగా డిపో ఇన్చార్జి సునీత మాట్లాడుతూ.. అతివేగం, నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు గాల్లో కలుస్తున్న తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. సీట్ బెల్ట్ ధరించకపోవడం, మద్యం మత్తులో వాహనం నడపడం వంటివి నేరాలే కాకుండా సామాజిక విపత్తులని అధికారులు హెచ్చరించారు. ఒక చిన్న పొరపాటు వల్ల ఒక ప్రాణం పోతే, ఆ వ్యక్తిపై ఆధారపడిన కుటుంబం ఎంతటి రోడ్డున పడుతుందో సిఐ సురేష్ అత్యంత భావోద్వేగంగా వివరించారు. "మద్యం సేవిస్తే వాహనం తాకవద్దు.. వేగంలో వీరత్వం లేదు" అని ఆయన హెచ్చరించిన తీరు, ఒక బాధ్యతాయుతమైన అధికారి ప్రజల క్షేమం కోసం పడే తపనను చాటిచెప్పింది. పట్టణ ప్రజలందరూ పోలీసుల ఈ చొరవను అభినందిస్తూనే, రోడ్డు భద్రతను తమ నిత్యజీవితంలో ఒక భాగంగా మార్చుకుంటామని ప్రతిజ్ఞ చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో పోలీస్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కుప్పంలో నేడు ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

◆ **విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పిలుపు.**

**కుప్పం,ఏప్రిల్ 13 (జన సంఘర్షణ):**




కుప్పంలో నేడు మంగళవారం అంబేద్కర్ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పంలో మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. సాయంత్రం నాలుగు గంటలకు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆపై బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## పూతలపట్టులో విజిలెన్స్ అధికారుల దాడులు



◆ **నాలుగు సిలిండర్లు సీజ్**

**పూతలపట్టు ఏప్రిల్ 13, (జన సంఘర్షణ)**

పూత పూతలపట్టు మండల కేంద్రంలో తిరుపతి విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించి అక్రమంగా ఉన్న నాలుగు సిలిండర్లు సీట్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ తిరుపతి విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ కరీముల్లా ఆదేశాల మేరకు గ్యాస్ సిలిండర్ లపై దాడులు నిర్వహించామని. ఈ దాడుల్లో వ్యాపారస్తులు కమర్షియల్ సిలిండర్స్ బదులు గృహాలకు వాడే సిలిండర్లు వాడుతున్నారు. వాటిని పరిశీలించి సీజ్ చేశామన్నారు. వ్యాపారస్తులు తప్పనిసరిగా కమర్షియల్ సిలిండర్స్ నే వాడాలన్నారు. పూతలపట్టులో పలు దుకాణాల్లో అక్రమంగా సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అధిక మొత్తానికి అమ్మి సొమ్ము చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అందువల్లనే దుకాణాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు గృహ వినియోగం ఉపయోగించే సిలిండర్లను పలువురు దుకాణదారులు దుకాణాలలో వాడుతున్నారని సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్మడం చట్టరీత్య నేరమని తెలిపాడు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డ్యూటీ మోహన్ రాజు, వీఆర్వో నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత వారోత్సవాలు బయ్యారం గ్రామపంచాయతీలో అవగాహన కార్యక్రమం

**ఇల్లందు ప్రతినిధి (జన సంఘర్షణ)**



బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్, బయ్యారం ఎస్ఐ-2 మహబూబి పాల్గొన్నారు. సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహబూబి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనాలకు కాలుష్య ధ్రువీకరణ పత్రం, బీమా, రోడ్ పన్ను తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని హెచ్చరించారు. పాదచారులు, సైకిల్ వాహనదారులకు దారి ఇవ్వాలని సూచించారు. ప్రమాదాల సమయంలో గాయపడిన వారు స్పృహలో లేకపోతే సీపీఆర్ వంటి ప్రాథమిక చికిత్స చేయాలని వివరించారు. ఈ సందర్భంగా బయ్యారం గ్రామపంచాయతీ నుంచి 7 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. అందులో ఒక అంగన్వాడీ టీచర్, ఒక ఆశా వర్కర్, యువత నుంచి ముగ్గురు, ఒక రిటైర్డ్ టీచర్, ఒక మహిళ సభ్యురాలిగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలతో రోడ్డు భద్రతపై ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎనుగుల ఉమా రంజిత్, గ్రామపంచాయతీ కార్యదర్శి రాంబాబు, మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్, వార్డు సభ్యులు బందెల కలింగరెడ్డి, బానోత్ అజయ్, బానోత్ సునీత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంబాల ముసలయ్య, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్ రెడ్డి, తాటి జనార్ధన్, సూర్యనారాయణ, నందిపాటి బవాణి, రామగిరి వెంకటేశ్వర్లు, కాసం ఉప్పల్ రెడ్డి, కంచర్ల సురేష్, మధార్, ఆర్మీ సతీష్, బీరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి మండల తాహసిల్దార్‌గా సుబ్రహ్మణ్యం

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (జన సంఘర్షణ):**




శ్రీకాళహస్తి మండల తహసిల్దార్‌గా టీవీ సుబ్రహ్మణ్యం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చిన ఎమ్మార్వో కార్యాలయంలో తనను సంప్రదిస్తే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రీవెన్స్ డే కార్యక్రమానికి ఎక్కువ ప్రాముఖ్యతను ఇచ్చి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ ను విజయవంతంగా కొనసాగించేందుకు తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
మంగళవారం 14 ఏప్రిల్ 2026

# ఎస్సీ ఎస్టీ గృహాలకు ఉచితంగా సోలార్ రూట్ టాప్ యూనిట్ను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్




కార్వేటి నగరం ఏప్రిల్ 13 (జనసంఘర్షణ)
గంగాధర్ నెల్లూరు మండలంలో పీఎం సూర్య ఘర్ మాఫ్ట్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ గృహాలకు ఉచితంగా సోలార్ రూట్ టాప్ యూనిట్ను చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ లు ప్రారంభించారు. గంగాధర్ నెల్లూరులో 5000 గృహాలు ఉన్నాయి ఈ సోలార్ ప్యానల్ కెపాసిటీ రెండు కిలోలవాట్స్ ఇది చిన్న కుటుంబాలకు ఎంతో ఉపయోగకరం. రెండు కిలోల వాట్స్ వాడితే వారికి 500 నుంచి 600 రూపాయలు ఆదా చేసుకోవచ్చు. అదనంగా వాడితే అందుకు మీరు చెల్లించవలసి ఉంటుంది. ఇది ఎంతో ఉపయోగకరం అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ.. సీఎం సూర్య ఘర్ మాఫ్ట్ పథకం ఒక పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఈ పథకంపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలి. గ్రామాల్లో విద్యుత్తు తీగలకు కొక్కి తగిలించి అక్రమ విద్యుత్ కు ఫుల్ స్టాప్ పెట్టండి. సోలార్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు విద్యుత్ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వెదురుకుప్పం మండలంలో పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే విప్ థామస్

కార్వేటినగరం ఏప్రిల్ 13 (జనసంఘర్షణ):



వెదురుకుప్పం మండలం పచ్చికాపలం పంచాయతీ దాసరి కాలనీలో డ్రైనేజీ ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ఈరోజు వెదురుకుప్పం లో జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో మన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కి, ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. స్పందించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే వీలైనంత త్వరగా డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలు చెందిన అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పార్లమెంటరీ సభ్యులను కలిసిన కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్

కుప్పం,ఏప్రిల్ 13 (జనసంఘర్షణ):



కుప్పం ఇంజనీరింగ్ కళాశాల వైస్-చైర్మన్ డాక్టర్ ఎన్. సునీల్ రాజ్, మేఘాలయ పార్లమెంట్ సభ్యులు సాలెంగ్ ఎ. సంగ్మా, నాగాలాండ్ పార్లమెంట్ సభ్యులు, పిసిసి అధ్యక్షులు సుపోంగ్మెరెన్ జమీర్‌లను మర్యాద పూర్వకంగా కలుసుకున్నట్లు తెలిపారు. న్యూఢిల్లీలోని వారి కార్యాలయంలో వారిని కలిశారు. ఈ సమావేశంలో, ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులకు ఉన్న విద్యావకాశాల గురించి చర్చించారు. విద్యా రంగంలో 25 ఏళ్ల ఘనమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నందుకు కుప్పం ఇంజనీరింగ్ కళాశాలను ఆ ఇద్దరు గౌరవనీయ పార్లమెంట్ సభ్యులు అభినందించారు. డాక్టర్ ఎన్. సునీల్ రాజ్ ఆ ఇద్దరు ఎంపీలను సత్కరించి, వారికి కళాశాల ప్రాస్పెక్టస్‌ను అందజేశారు.

## ఆత్మ హత్య చేసుకో బోతున్న బాలికను రక్షించిన చిత్తూరు పోలీస్

కార్వేటి నగరం ఏప్రిల్ 13 (జనసంఘర్షణ):
కార్వేటి నగరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఒక బాలిక ఆదివారం రాత్రి 11.00 గంటలకు సోషల్ మీడియాలో ఈ క్రింది పోస్ట్‌ను పోస్ట్ చేసింది "నువ్వు జీవితాంతం సంతోషంగా ఉండాలి మామా. అదే నా కోరిక నేను నిన్ను ప్రేమిస్తున్నాను మామా. నిన్ను చాలా మిస్ అవుతున్నాను మామా."ఈ రోజు నా చివరి రోజు. జీవితంపై ఇక ఆసక్తి లేదు. నాకు ఇంకెవ్వరూ అవసరం లేదు. ఎవరిని కూడా డిస్టర్బ్ చేయను. అది నా తప్పు, నా అజ్ఞానం. నేను ఎప్పుడూ బాధపడుతూ ఉంటాను. నేను ఎప్పుడూ ఇలానే చనిపోతూ ఉంటాను.' ఇదే నా చివరి రోజు అని సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఆ బాలిక ఆత్మ హత్య చేసుకోబోతుంది. అత్యంత ప్రమాదంలో ఉంది అని చిత్తూరు జిల్లా యస్పి తుషార్ డూడి పర్యవేక్షణ లో నడుస్తున్న సోషల్ మీడియా యూనిట్ వారు ఇచ్చిన అలెర్ట్ మెసేజ్ మేరకు సీఐ కార్వేటి నగరం యస్. హనుమంతప్ప వారి సిబ్బంది వెంటనే స్పందించి, ఆ అమ్మాయి ఉన్న ప్రదేశాన్ని గుర్తించి, ఆమెను ప్రమాదం నుంచి కాపాడి ఆ బాలికకు వారి తల్లితండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి ఆ అమ్మాయికి భరోసా కల్పించడం జరిగినది.

## మామిడి రైతులకు సబ్సిడీపై కవర్‌లు పంపిణీ..

పలమనేరు,ఏప్రిల్ 13 (జనసంఘర్షణ):



పలమనేరు రూరల్ మండలం టి.వడ్డూరు రైతుసేవా కేంద్రం నందు హార్టికల్చర్ ఆఫీసర్ మౌనిక ఆధ్వర్యంలో మండలంలోని మామిడి రైతులందరికీ సబ్సిడీతో మామిడికాయల కవర్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల పార్టీ అధ్యక్షులు నాగరాజ రెడ్డి, బయ్యప్పగారిపల్లి సింగల్ విండో చైర్మన్ వెంకటముని రెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ....ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకొనే ప్రయత్నంలో భాగంగా సబ్సిడీ పై మామిడి కవర్ లను అందిస్తున్నదని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇంకనూ నాయకులు కవీంద్ర నాయుడు, రామ్మూర్తి నాయుడు పూర్ణచంద్ర నాయుడు, శరవణ నాయుడు, రైతు సోదరులు పాల్గొన్నారు.

## రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో తులాభారం

కార్వేటినగరం ఏప్రిల్ 13 (జనసంఘర్షణ):



కార్వేటినగరంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారశీ ఉదయం గుంటూరు జిల్లా చిలకలూరిపేట గ్రామానికి చెందిన రాఘవరావు లక్ష్మి దంపతుల కుమారుడు హరీష్ రాజేశ్వరి దంపతుల కుమారుడు తన్విక్‌కు తులాభారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత సంవత్సరం స్వామివారిని దర్శించుకున్నప్పుడు మా కుమారుడికి సంతానం కలగాలని మొక్కుకున్నామని, దేవుడు అనుగ్రహంతో ఈ ఏడాది బాబు పుట్టడంతో దేవుని దర్శించుకుని ఏడు కేజీల నాణాలతో తులాభారం నిర్వహించమని తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పవన్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వామి, అమ్మవారిని దర్శించుకున్న... పాట్నా హైకోర్టుజడ్జ్

శ్రీకాళహస్తి ఏప్రిల్ 13 (జనసంఘర్షణ):



శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంకు పాట్నా హైకోర్టు జడ్జ్ అనుపమ చక్రవర్తి కుటుంబ సమేతంగా సోమవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనానికి విచ్చేశారు, .ముందుగా ఆలయ అధికారులు వారిని సాదరంగా ఆహ్వానించి వారికి రాహు కేతు పూజలు, అంతరాలయ దర్శనం, వేద ఆశీర్వచనం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏ ఈ ఓ మోహన్, ఏపీఆర్ఓ రవి, స్థానిక కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

పలమనేరు, ఏప్రిల్ 13 (జనసంఘర్షణ):



పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ మోహన్ రెడ్డి తెలిపారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహం మార్చురీలో ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి వయసు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందని, మృతుడు బిస్కెట్ కలర్ షర్టు, పాచి కలర్ సిల్క్ ప్యాంట్ ధరించి నట్టు, అతడి వద్ద గుర్తింపునకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. మృతుడి బంధువులు , తెలిసినా వారు ఎవరైనా ఉంటే సీఐ 9440796733, ఎస్ఐ 9440796734 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

## రేణిగుంట తాహాసిల్దార్గా బాధ్యతలు స్వీకరించిన జి.శ్యాం ప్రసాద్

రేణిగుంట (జనసంఘర్షణ):



తిరుపతి జిల్లా రేణిగుంట మండలం తహసిల్దారుగా జి. శ్యాం ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దిలీప్ ఆర్ ఎస్ డి టి , కరుణాకర్ మండల సర్వేయర్, టి. శంకర్ విఆర్ఓ శ్రీకాళహస్తి డివిజన్ విఆర్ఓ అసోసియేషన్ ప్రెసిడెంట్, బాబు రేణిగుంట మండల విఆర్ఓ అధ్యక్షులు, హేమంత్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కె. సుబ్రహ్మణ్యం, నలిని, రామ్మూర్తి, దిలీప్ విఆర్వో, వీఆర్ఏలు కార్యాలయ సిబ్బంది ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పి.జి.ఆర్.ఎస్‌లో 76 వినతుల స్వీకరణ

- సమస్యలపై వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ

తిరుపతి, ఏప్రిల్ (జనసంఘర్షణ):



జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఫిర్యాదుదారుల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 76 మంది ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, ప్రతి అంశంపై వెంటనే స్పందించారు. ఫిర్యాదుదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా తెలుసుకున్న ఎస్పీ, అందిన వినతులను సంబంధిత అధికారులకు వెంటనే పంపిస్తూ ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి సమస్యకు త్వరితగతిన న్యాయం జరిగేలా అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు (పరిపాలన), శ్రీనివాస్ (క్రైమ్) పాల్గొన్నారు.

## పీజేఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వి. ఎం థామస్

- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

కార్వేటినగరం ఏప్రిల్ 13 (జనసంఘర్షణ):



సమస్యల పరిష్కారంలో అల స్వత్వం వద్దు అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం వెదురు కుప్పం, ఎంపీడీవో కార్యాలయం నందు నిర్వహించిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమం అమల లో భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొని ప్రజల నుంచి వినతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ వి ఎం థామస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు అధిక మొత్తంలో ఉన్నాయని వాటిని పరిష్కరించవలసిందిగా తెలిపారు.ఈ మండలంలో అధిక శాతం రైతులు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని మేము ఆదాయం చెల్లించాం, కానీ ట్రాన్స్‌ఫార్మర్ అందలేదు" అని ఎలాంటి సమస్యలు అందిస్తున్నారని తెలుస్తోంది. ఈ పెద్ద సంఖ్యలో అభ్యర్థనలు రావడం అసాధారణం. వెంటనే సీఎంతో సంప్రదించి, 40 ట్రాన్స్‌ఫార్మర్ల ప్రత్యేక మంజూరు పొందాము. కలెక్టర్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలపదలచుకున్నాం. ప్రస్తుత ప్రభుత్వం సమగ్ర, వ్యవస్థాగతంగా ప్రజల ప్రయోజనాల కోసం చట్టబద్ధంగా చర్యలు చేపడుతుంది. తహసీల్దార్ మరియు వర్గాధికారులు కాస్త వేగంగా, బాధ్యతాయుతంగా పని చేయటం ద్వారా మరిన్ని సమస్యలను త్వరగా పరిష్కరించవచ్చు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి మూడు నెలలుగా అర్జీల తాకిడి తగ్గి మొఖం పట్టిందన్నారు. మండలాలలో ఎవరెవరు దగ్గర ఫైల్ పెండింగ్లో ఉన్నాయనేది ఎమ్మార్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించుకుని వాటి నివేదికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

# ఇంటర్మీడియట్ ఫలితాలలో వైబ్రంట్ జూనియర్ కాలేజి ప్రభంజనం

**హనుమకొండ జనసంఘర్షణ**



ఆదివారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో హనుమకొండ నక్కల గుట్టలోని వైబ్రంట్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా వైబ్రెంట్ జూనియర్ కాలేజి చైర్మన్ సిరంగి శ్రీనివాస్, డైరెక్టర్ సిహెచ్ రాజేందర్ రెడ్డి లు మాట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థుల కోసం కోటా రాజస్థాన్ వారి వైబ్రంట్ అకాడమిని వరంగల్లో స్థాపించడం జరిగిందని తెలిపారు. తదనంతరం ఎమ్.పి.సి. మొదటి సంవత్సరం లో అల్లపురం రిషీకీర్తణ్-468/470, మాలోతు వెన్నెల- 468/470, కంచర్ల పౌర్ణమి468/470 బైపిసి గుగులోతు అరుంధతి 437/440, భాను అక్షయ437/440, పెరుక యోగిత 436/440, వీరితో పాటుగా మొదటి సంవత్సరం ఎమ్.పి.సి.లో 48 మంది విద్యార్థులు 460/470 మార్కులకు పైగా, బై.పి.సి.లో 17 మంది విద్యార్థులు 430/440 మార్కులకు పైగా సాధించారు మరియు రెండవ సంవత్సరం ఎమ్.పి.సి. లో కందికొండ రంజిత్ కుమార్993/1000, పోషాల శ్రీమహర్ష 992/1000 ముసుకు సోను ప్రియా991/1000, కొనే జాహ్నవి991/1000, హర్షిత982/1000, కునుసోతు సాయి 981/1000 వీరితో పాటుగా రెండవ సంవత్సరం లో 14 మంది విద్యార్థులు 985/1000 పైగా సాధించిన విద్యార్థులను అభినందిం చారు. ఈ కార్యక్రమంలో వైబ్రెంట్ అకాడామి ప్రిన్సిపాల్ టి. శేషకుమార్, అడ్మినిస్ట్రేషన్ హెడ్ జి. రఘుపతి, కోఆర్డినేటర్ రామ్ గుమ్మడి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డ పెళ్లికి 'పెద్దన్న' సాయం.

**మాచాపూర్ సర్పంచ్ ఉదారత**

**మేడిపల్లి జనసంఘర్షణ :**



మేడిపల్లి మండలం మాచాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ పెటేరి రోజా నాగరాజు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ పేద కుటుంబానికి అండగా నిలిచారు. గ్రామంలోని పేద ఆడబిడ్డల వివాహాలకు తన వంతుగా 5,116 ఆర్థిక సహాయం అందజేస్తానని గతంలో ప్రకటించిన సర్పంచ్, ఆ మాటను నిలబెట్టుకుంటూ నేడు మాచాపూర్ గ్రామానికి చెందిన దొడ్డి నర్సు కిశే. పెద్ద కొండయ్య దంపతుల కుమార్తె వనజ వివాహానికి, వధువు కుటుంబానికి 5,116 నగదును పెళ్లి కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెటేరి రోజా నాగరాజు మాట్లాడుతూ.... గ్రామంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా నిలబడటమే తన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా ఆడబిడ్డల వివాహాలు కుటుంబాలకు భారంగా మారకుండా చేయాలనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందిస్తున్నానని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం తన వంతు కృషి కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ చేస్తున్న సేవా కార్యక్రమంపై వధువు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఆయన సేవా భావాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు..

# గ్రీవెన్స్ డే సందర్భంగా పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్

**బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం**

**జగిత్యాల జనసంఘర్షణ :**





ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 22 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు..ం

# సాయి స్రవంతి ఎంటర్ప్రైజెస్,సివిలైజ్ మార్ట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సింగిరెడ్డి పద్మారెడ్డి

**యువత తమకిష్టమైన రంగంలో రాణించేందుకు కృషి చేయాలి**

**బోడుప్పల్ జనసంఘర్షణ :**



మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని కొర్రెముల డివిజన్లో సాయి స్రవంతి ఎంటర్ప్రైజెస్, సివిలైజ్ మార్ట్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పాల్గొని నిర్వాహకులు ఇల్లందుల దత్త సాయి, నల్ల మాస ప్రవీణ్ లకు శుభాకాంక్షలు తెలిపారు. యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా తమకిష్టమైన రంగంలో కృషి చేస్తే తప్పకుండా విజయం సాధిస్తారని, అందుకు దత్త సాయి, ప్రవీణ్ లే నిదర్శనమని, వారు ఉపాధి పొందడమే కాకుండా మరి కొంతమంది యువతకు ఉపాధిని కల్పించడం విశేషమని వారు వ్యాపార రంగంలో దినదిన అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని సింగిరెడ్డి పద్మారెడ్డి అన్నారు.

# స్టేట్ టాప్ ర్యాంక్స్ తో రెజోనెన్స్ విజయఢంకా

**హనుమకొండ జనసంఘర్షణ**



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం విడుదలైన ఇంటర్ మొదటి, రెండవ సంవత్సర ఫలితాల్లో హన్మకొండలోని రెజోనెన్స్ విద్యాసంస్థలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరంకు చెందిన పొన్నాల వరుణ్ 468, కంపెల్లి తనుశ్రీ 468, దొనికెల సహస్ర 468 మార్కులు సాధించి ఏకంగా స్టేట్ సెకండ్ ర్యాంక్స్ సొంతంచేసుకున్నారు. అదేవిధంగా బైపీసీ మొదటి సంవత్సరం ఈ భాగంలో గుమ్మడవెల్లి మహతి 438, బంక వైష్ణవి 437, సఫియా కౌసర్ 437 మార్కులు సాధించారు. ఎంపీసీ రెండవ సంవత్సరం విభాగంలో జి. సాయికీర్తన 995, నారోజు హర్షల్ 994, దండె వర్ష 994, మార్కులతోను, బైపీసీ విభాగంలో గంగ్ర శ్రీజ 991, సుఫయా తబస్సుమ్ 989 మార్కులు సాధించారు. రెజోనెన్స్ విద్యాసంస్థలు జె.ఈ.ఈ. మరియు నీట్ లాంటి జాతీయస్థాయి పోటీపరీక్షల్లో అత్యంత విలువైన ర్యాంకులతో పాటు రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ విద్యా ఫలితాల్లోనూ తమదే పైచేయి అని నిరూపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో రెజోనెన్స్ చైర్మన్ లెక్కల రాజిరెడ్డి మాట్లాడుతూ స్థాపించిన మొదటి సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం ఎంతో క్లిష్టమైన జాతీయ స్థాయి జె.ఈ. ఈ, నీట్ పోటీపరీక్షల్లో చాలా గొప్ప ర్యాంకులు సాధిస్తూ ఐఐటి లలోను, ఎన్ ఐ టి లలోను, మెడికల్ కాలేజీలలోను సీట్లు సాధిస్తున్నారని ఆనందం వ్యక్తపరిచారు. ఇదే స్ఫూర్తితో రాబోయే జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన జే.ఈ.ఈ అడ్వాన్స్ డ్ అండ్ నీట్ పోటీ పరీక్షలు మరియు టీఎస్ఈఏపిసిఈటి ఇంకా ఇతర పోటీ పరీక్షలలో అత్యంత విలువైన టాప్ ర్యాంక్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో చైర్మన్ లెక్కల రాజిరెడ్డి, డైరెక్టర్స్ లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి. సీఏఓ లెక్కల రమ్యారాజిరెడ్డి, అకాడమిక్ డీన్ బి.యస్. గోపాలరావు,అన్ని బ్రాంచిల ప్రిన్సిపల్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# న్యూ శాయంపేట ను సుందరంగా తీర్చిదిద్దుతా

**మేయర్,కార్పొరేటర్ తో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయినాయిని**

**హనుమకొండ జనసంఘర్షణ :**

హనుమకొండ న్యూ శాయంపేట ను సుందరంగా తీర్చిదిద్దానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రెడ్డి అన్నారు. ఆదివారం 31వ డివిజన్లో మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ మామిండ్ల రాజు తో కలిసి శంకుస్థాపన చేశారు. న్యూ శాయంపేట చౌరస్తా కూడలికి సమీపాన ఉన్న ఆంజనేయ స్వామి వారి ఆలయానికి రోడ్డు మరియు డ్రైనేజీ, శాయంపేట గ్రామంలోని కొన్ని కాలనీలకు సంబంధించి రడ్డు పనులకు 85 లక్షల తో శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుత, 31వ డివిజన్ అభివృద్ధికి ఎల్లవేళలా కట్టుబడి ఉన్నామని, ప్రతి గల్లీకి రోడ్డు మరియు డ్రైనేజీ పనులు ప్రారంభమవుతాయని, పట్టణ వాతావరణానికి అనుసంధానం చేసే విధంగా ఈ గ్రామ అభివృద్ధికి అడుగులు వేగవంతంగా వేస్తున్నామని తెలిపారు. సుమారు 16 కోట్ల రూపాయలు 31వ డివిజన కు ఖర్చు పెట్టామని ఆయన చెప్పారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మరియు ఎమ్మెల్యే పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పనితీరు 31 డివిజన్ కు ఎంతో అభివృద్ధికి కారణమైందని తెలిపారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా వేగవంతంగా జరుపుతున్నందుకు మాకు ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. కార్పొరేటర్ మామిండ్ల



రాజు మాట్లాడుతూ,31వ డివిజన్లో ఏ సమస్య ఉన్న సమస్య పరిష్కరించే దిశగా పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సహకారంతో అభివృద్ధి దిశగా వెళ్తున్నామని, 31 డివిజన్ అభివృద్ధికి

# "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో బాగంగా రోడ్డు భద్రతపై గ్రామ సభల నిర్వహణ

**జగిత్యాల జనసంఘర్షణ :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు మొదటి రోజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో రోడ్డు భద్రతపై గ్రామ సభలు నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభలకు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రభుత్వ అధికారులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామ సభల సందర్భంగా గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, కల్వర్టులు, అలాగే రహదారులపై ప్రమాదకరంగా ఉన్న చెట్లను గుర్తించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని రోడ్ల పక్కన ఉన్న పొదలను తొలగించడం, ప్రమాదకర గుంతలను పూడ్చడం వంటి తక్షణ




మరమ్మతు పనులు చేపట్టడం జరిగింది. అదేవిధంగా గ్రామాల్లో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసి స్థానిక నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత సభ్యులుగా ఈ కమిటీల్లో భాగమయ్యారు. గ్రామాల్లో రోడ్డు భద్రతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించేందుకు ఈ కమిటీలు కీలకంగా పనిచేయనున్నాయి. గ్రామ సభలో పాల్గొన్న ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలనే సంకల్పంతో ప్రమాణం చేశారు. హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై అవగాహన



కల్పించారు. రోడ్డు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, వాటి వివరాలను జిల్లా రోడ్డు భద్రత కమిటీకి పంపించి తక్షణ చర్యలు తీసుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు.

# చిల్కానగర్ లో ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలను తొలగించాలి

- **ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలి...**
- **ప్రభుత్వ స్థలాలలో.... ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ... ప్రభుత్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి**
- **చిల్కానగర్లో ప్రైవేటు వ్యక్తుల నుండి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి ....**
- **బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్**

**ఉప్పల్ జనసంఘర్షణ :**

చిల్కానగర్ డివిజన్లోని మల్లికార్జున్ నగర్ బొడ్రాయి వెనకాల ఉన్న ప్రాంతంలో ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేశారని దానివల్ల సీవరేజ్ అవుట్లెట్ మూసుకుపోయి చాలా ఇబ్బంది కలుగుతుందని... వారు ఇష్టం అనుసారంగా సీవరేజ్ మరియు స్టార్మ్ వాటర్ డ్రెన్ పైప్ లైన్లను మళ్లించి డివిజన్ ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నారని



బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ చిల్కానగర్ డివిజన్ ప్రజలతో కలిసి ఉప్పల్ తహసిల్దార్ ఫూల్ సింగ్ చౌహాన్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ప్రవీణ్ ముదిరాజ్ ఎమ్మార్వోతో మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలలో ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేసి వాటిని అద్దెకు ఇస్తున్నారని అదేవిధంగా వెంటనే ఎమ్మార్వో గారు దీనిపై స్పందించి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని అక్రమంగా సీవరేజ్ పైప్ లైన్లను తొలగించటం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని అవుట్లెట్ లేకుండా శివరాజ్ పైప్ లైన్లను వారి ఇష్టానుసారంగా మార్చుకున్నారని అన్నారు. ఇదే కాకుండా ప్రైవేట్ పట్టాదారులు వారికి



ఉన్న స్థలము కంటే చుట్టుపక్కల ప్రభుత్వ స్థలాలు అన్నిట్లో కూడా నిర్మాణాలు వేస్తున్నారని వాటిని వెంటనే తొలగించి ప్రభుత్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి వినతి పత్రానికి స్పందిస్తూ ఎమ్మార్వో తక్షణమే ఆర్ఐనీ పంపించి పర్యవేక్షించమని తెలుపుతానని అదే విధంగా వీలైనంత తొందరలో సర్వే ఏర్పాటు చేసి ప్రభుత్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తానని అక్రమ నిర్మాణాలు చేసిన వారిపై మరియు భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో కొండల్ రెడ్డి , జల్లి మోహన్,మల్లికార్జున నగర్ అధ్యక్షులు అశోక్ చారి, మధు, మౌలాలి,భరత్,సాయి మొదలగు వారు పాల్గొన్నారు

# టీఆర్పీ కోరుట్ల పట్టణ అధ్యక్షుడిగా ఎన్నం రాజశేఖర్ నియామకం

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలోపేతమే లక్ష్యం ఎన్నం రాజశేఖర్**

**కోరుట్ల/ప్రజావారధి:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాలమేరకు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో భాగంగా సోమవారం జగిత్యాల టీ ఆర్పీ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజ్యాధికార పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు సాయిని పాపన్న ఆధ్వర్యంలో టీఆర్పీ కోరుట్ల పట్టణ అధ్యక్షుడిగా ఎన్నం రాజశేఖర్ ను నియమించారు. ఈ సందర్భంగా ఎన్నం రాజశేఖర్ మాట్లాడుతూ. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన మల్లన్న కు, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు సాయిని పాపన్న కు, టీ ఆర్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల హనుమాండ్లుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వెల్దండలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహణ





**కల్వకుర్తి/ జనసంఘర్షణ**

కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండలో రోడ్డు భద్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘువీర్ రెడ్డి సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యక్రమం)లో భాగంగా నిర్వహించిన "అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ - 2026" ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం సోమవారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘువీర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ కురుమూర్తి హాజరై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. మైనర్ బాలురకు వాహనాలు ఇవ్వకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి ప్రమాదం జరిగినా కుటుంబ సభ్యులు ఎదుర్కొనే బాధ తీవ్రంగా ఉంటుందని గుర్తు చేశారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పోలీసులతో సమన్వయం పెంపొందించేందుకు గ్రామ సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి గిరి, వార్డు సభ్యులు పాలాది మల్లీశ్వరి రంగనాథం, గుద్దటి కిష్టల్, మసిగుండ్ల వెంకటేష్, పిల్లి దేవేందర్, బాదేపల్లి రమేష్, ఎస్. శేఖర్, రవీందర్ రెడ్డి, నాయకులు రషీద్, మట్ట భరత్, తిరుపతి రెడ్డి, ముదిగొండ రమేష్, మరేపల్లి శ్రీను, పుల్లయ్య, విష్ణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎమ్మార్వోని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



**అన్నపురెడ్డిపల్లి జనసంఘర్షణ:**

అన్నపురెడ్డిపల్లి మండలానికి నూతనంగా విచ్చేసిన ఎమ్మార్వో స్వర్ణ, ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పర్స వెంకట్, వేముల రమణారావు, మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలుపుతూ, మండల అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన మండల అధ్యక్షులు వేముల నరేష్ బాబు, మర్రిగూడెం సర్పంచ్ కోంద్రు సృజన, ఉపసర్పంచ్ గాలం కాటమరాజు, మండల నాయకులు దుబ్బకుల రాము, మరకల లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.హెచ్.పి ఖిలవరంగల్ అధ్యక్షులుగా ఈశ్వరప్రసాద్ నియామకం



**వరంగల్ జనసంఘర్షణ:**

రాష్ట్రీయ హిందూ పరిషత్(ఆర్ హెచ్ పి) సంస్థ ఖిలవరంగల్ అధ్యక్షులుగా ఈశ్వం ప్రసాద్ నియామకం. రాష్ట్రీయ హిందూ పరిషత్ సంస్థ ప్రయోజనాలు సనాతన ధర్మ పరిరక్షణ లక్ష్యాలు హిందూ సమాజ ఐక్యత అవసరాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రీయ హిందూ పరిషత్ తెలంగాణ కమిటీ నిర్ణయం మేరకు గౌరవనీయులు శ్రీ జంగం ఈశ్వర్ ప్రసాద్ ని వరంగల్ ఖిలవరంగల్ మండల అధ్యక్షుడిగా నియమించడం జరిగిం ది. అలాగే తెలంగాణ (ఆర్ హెచ్ పి) రాష్ట్ర అధ్యక్షులు కొడారి రాజు, మండలం భూపా ల్, కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## హుగ్గెలిలో 'అరైవ్-అలైవ్' అవగాహన సదస్సు

**ప్రజా వారధి జనసంఘర్షణ:**

జహీరాబాద్ మండలంలోని హుగ్గెలి గ్రామంలో సోమవారం రోడ్డు భద్రతపై 'అరైవ్-అలైవ్' అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం, రూరల్ ఎస్ఐ కాశీనాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేసి, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో ఫోన్ ఉపయోగించకూడదని సూచించారు.

అనంతరం హుగ్గెలి గ్రామస్థులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాదరహిత గ్రామం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# 'శివానీ' కళాశాల విజయదుందుభి

**ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు విద్యాసంస్థల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి అభినందనలు**






NERELLA RISHITHA
HT.No:2638201884
Group:MPC
Marks:995



PONUGOTI SAHASRA SRI
HT.No:2638205521
Group:BiPC
Marks:995


**హనుమకొండ జనసంఘర్షణ:**

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో శివానీ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీ విభాగంలో విద్యార్థి నేరెళ్ల రిషిత 995 మార్కులు, లాకుంట్ల చక్రిక 994 మార్కులు, ఆలకుంట్ల నవ్య 994 మార్కులు, బక్క సంధ్య 994 మార్కులు, కనకం రంజిత్ 994 మార్కులు, సెకండియర్ బైపీసీ విభాగంలో పి.సహస్ర శ్రీ 995 మార్కులు సాధించారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో మేకల శ్రావ్య 468 మార్కులు, బీణవేణి అఖిలేష్ యాదవ్ 467 మార్కులు, పాక రక్షిత 466 మార్కులు, కేసరి రితిక 466 మార్కులు సాధించారనిన శివానీ విద్యాసంస్థల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో తాళ్లపల్లి వర్షిత437 మార్కులు, బుద్దె వైష్ణవి 436 మార్కులు, మాలోత్ గాయత్రి 436 మార్కులు సీఈసీ విభాగంతో జి.అజయ్ 485 మార్కులు సాధించారని తాళ్లపల్లి స్వామి తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ స్వామి, ప్రిన్సిపాల్స్ జి.సురేందర్ రెడ్డి, చంద్రమోహన్, డైరెక్టర్లు టి.రాజు, ఎన్. రమేష్, ఎ.మురళీధర్, వి.సురేశ్, ఎస్.సంతోష్ రెడ్డి అభినందించారు.

# పొంచి ఉన్న ప్రమాదం పట్టించుకోని పంచాయతీ అధికారులు

**అధికారులుకు డబ్బులు కడితే పనిచేస్తారా?**





**సుజాతనగర్/ జనసంఘర్షణ:**

సుజాతనగర్ మండలం సర్వారం గ్రామపంచాయతీ, గోపా తండాలోని ఒక కిరణ షాప్ ముందు చిన్నపిల్లలు ఆడుకోవడానికి , కానీ కిరాణా సరుకులు తీసుకోవడానికి వచ్చిన వారు తిరిగి ఇంటికి వెళతారో లేదో తెలియనటువంటి పరిస్థితి నెలకొంది. ఇంటి ఆవరణలో చిన్న పిల్లలకు సైతం తగిలేటటువంటి విధంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ను తొలగించమని పలుమార్లు గ్రామ సర్పంచ్ పై స్థాయి కరెంటు అధికారులకు తెలియజేసిన కూడా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా దానికి షిఫ్టింగ్ చేయాలంటే ప్లేస్ చూపించాలి లేదా డబ్బులు ఇవ్వాలి అని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు అంటే లెక్క లేదా అధికారులకు కేవలం డబ్బులు కడితేనే పనిచేస్తారా.? ఆ ట్రాన్స్ఫార్మర్ తగిలి ఎవరికైనా ఏదైనా జరగరానిది జరిగితే దానికి బాధ్యులు ఎవరు? పలుమార్లు విన్నవించినా కూడా లైన్మెన్ గాని ఏఈ స్పందించడం లేదు. గ్రామ సర్పంచ్ నాకు సంబంధం లేదు నేను అధికారిని కాదు అన్నట్లుగా వ్యవహరించడం చాలా బాధాకరం. ప్రజల చేత ఎన్నుకోబడినటువంటి వ్యక్తి ప్రజల కోసం పనిచేయకపోవడం దారుణం. ట్రాన్స్ఫార్మర్ ను వెంటనే తొలగించి మరొక చోట ఏర్పాటు చేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాము. విద్యుత్ శాఖ అధికారులు , సర్పంచ్ ల ఒంటెద్దు పోకడలతో ఏదైన ప్రాణ నష్టం జరగక ముందే ట్రాన్స్ఫార్మర్ను తక్షణమే మార్చవలసిందిగా గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

# రోడ్డు భద్రతపై గ్రామసభల నిర్వహణ

**విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీల ఏర్పాటు**

**ఎస్సై కృష్ణయ్య**





**జనసంఘర్షణ మాడుగులపల్లి:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలలో సర్పంచ్ల అధ్యక్షతన రోడ్డు భద్రతపై గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు, ఈ గ్రామసభల్లో స్థానిక ఎస్సై కృష్ణయ్య మాట్లాడుతూ నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు వివరించారు ఈ సందర్భంగా గ్రామాల్లో పలు కీలక తీర్మానాలు చేశారు, రోడ్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్ల తొలగింపు, రహదారులపై ఉన్న గుంతల పూడ్చివేత, వీధి దీపాల ఏర్పాటుతో పాటు భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతరం ప్రతి గ్రామంలోనూ విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీ లను ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ సరోజ పావని, సర్పంచ్లు ఆరూరి నరేష్, సైదిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కాసిం, సతీష్ రెడ్డి, జీపీఓ లు పెద్దమాం శ్రీనివాస్, ప్రశాంత్ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు స్థానిక యువకులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో తాగునీరు, డ్రైనేజ్ సమస్యలపై కాంగ్రెస్ వినతి

**-ఉప్పల్ వాటర్ వర్క్స్ అధికారులతో చర్చ**

**- కాలనీల సమస్యల త్వరిత పరిష్కారానికి హామీ**



**ఉప్పల్ జనసంఘర్షణ:**

ప్రజావాణి కార్యక్రమంలో ఉప్పల్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్, డీజీఎం వేణుగోపాల్, మల్లాపూర్ ఏఈ రోహిత్లతో కలిసి కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ మరియు వారి బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతంలో నెలకొన్న తాగునీటి మరియు డ్రైనేజ్ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. "బస్తీబాట" కార్యక్రమంలో ప్రజలు వ్యక్తపరిచిన సమస్యల పరిష్కారం కోసం అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ముఖ్యంగా కే.ఎల్.రెడ్డి, హెచ్బిఎల్ కాలనీ, అన్నపూర్ణ, భవాని నగర్ కాలనీలలో తక్కువ ప్రెషర్తో తాగునీటి సరఫరా జరుగుతుండటం, ఓల్డ్ మల్లాపూర్లో మదీనా చికెన్ సెంటర్ ఎదురుగా కొత్త వాటర్ లైన్ మరియు కనెక్షన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం, పలు కాలనీలలో డ్రైనేజ్ లైన్ల ఏర్పాటు వంటి సమస్యలను ప్రస్తావించారు. ఈ సమస్యలపై స్పందించిన జీఎం సంతోష్ కుమార్ వాటిని అత్యవసరంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నెమలి అనిల్ కుమార్ కృషిని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ తాంద్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు కోయలకొండ రాజేష్,

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co